
Follow: @ANNTELUGU
ANN తెలుగు
12-02-2025
# మహా పత్రిక
బుధవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 72 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## లోలోన దాచుకోవొద్దు

### సమస్యను బయటకు చెప్పండి

పరీక్షా పే చర్చలో దీపికా పదుకొణె

వినూత్నంగా నిర్వహిస్తున్న ప్రధాని మోదీ

పూర్తివీడియో నేడు విడుదల

**మహా:** విద్యార్థులు తమకు ఏ సమస్య వచ్చినా లోలోపల దాచుకుని బాధపడొద్దని.. బయటకు చెప్పాలని బాలీవుడ్ నటి దీపికా పదుకొణె సూచించారు. స్కూల్లో చదువుకునేటప్పుడు తానూ అల్లరి పిల్లనే అని దీపికా పదుకొణె. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఏటా నిర్వహించే 'పరీక్షా పే చర్చ 'ను ఈసారి కాస్త వినూత్నంగా నిర్వహించారు. ఇందులోభాగంగా నటి దీపిక పాల్గొని.. మానసిక ఆరోగ్యంపై విద్యార్థులకు సలహాలిచ్చారు.

మిగతా 2లో

**టాప్ న్యూస్**

## ఉప ఎన్నికలు ఖాయం



- స్టేషన్ ఘన్ పూర్ లో శ్రీహరి పోయి రాజయ్య గెలుస్తారు
- పది స్థానాల్లో శాసనసభ్యుల ఓటమి తథ్యం
- ఫామ్ హౌస్ లో రాజయ్యతో కేసీఆర్

02

## నిరాశ, నిస్పృహలో ఉన్నాం



- అందుకే ఎమ్మెల్సీ ఎన్నికలకు బీఆర్ఎస్ దూరం
- బీజేపీతో లోపాయికారి ఒప్పందం లేనేలేదు
- మాజీ ఎంపీ వినోద్ కుమార్ కీలక వ్యాఖ్యలు

02

## ఏఐతో జాగ్రత్త



- ఏఐ భవిష్యత్ మరింత ప్రకాశవంతంగా ఉంటుంది
- యంత్రాల శక్తి పెరగడంపై ఆందోళన అవసరం లేదు
- ఉద్యోగాలు పోతాయనడం వదంతే
- స్కిల్లింగ్, రీ స్కిల్లింగ్ ద్వారా కొత్త రకం ఉద్యోగాలు
- ఫారిస్ సదస్సులో మోడీ

02

# మాకే పైసపైస కరువుంది



## కేసీఆర్ గుడికట్టిస్తనని కూల్చిండు

### కేసీఆర్ ఫామ్ చుట్టూ చిత్రవిచిత్రాలు

### ప్రతిపక్షమైనా కేసీఆర్ ను కలుసుడు అంత ఈజీ కాదు

### ఆయన చుట్టూ దుర్భేద్య కోట.. ప్రైవేట్ సైన్యం

### వ్యవసాయం రూటు మార్చిన కేసీఆర్.. ఎఎన్ఎన్ - మహా గ్రౌండ్ రిపోర్ట్

గుడికట్టిస్తనని చెప్పి.. వరదరాజుల పురం గుడి కూల్చిండు. ఎలక్షన్ల ముందే కూల్చిండ్రు. కట్టిస్తనని కట్టియ్యలే. ఓడిపోయినంక మేం దొరసాని కేసీఆర్ గారి భార్యని పోయి కలిసినం. అమ్మా.. గుడికట్టిస్తనని ఉన్న గుడి కూల్చినరంటే మాకే పైసపైస కరువుంది. ఏడికెళ్లి కట్టియ్యాలె అన్నది. గిపుడు అదే కూలగొట్టి ఉంది. అంటూ శివారు వరదరాజుల పురం గ్రామస్థుడు ఎఎన్ఎన్ మహాతో అన్నారు. ప్రతిపక్ష నేత కేసీఆర్ ఫామ్ లో ఏం చేస్తున్నారు.. ఆయనపై ఆయన ఫామ్ చుట్టూ ఉన్న పబ్లిక్ ఏమనుకుంటున్నారు? ఫామ్ హౌజ్ లో ఉన్న కేసీఆర్ ను జిల్లాల నుండి వచ్చేవారు కలవడం సులభమేనా అని ఎఎన్ఎన్ మహా ప్రతినిధులు ప్రయత్నం చేశారు. కేసీఆర్ ఫామ్ చుట్టూ పెద్ద ఎత్తున ప్రైవేట్ సెక్యూరిటీని కూడా ఏర్పాటుచేసుకోగా, జిల్లాల నుండి వచ్చేవారికి కూడా దర్శనభాగ్యం కలగడం లేదు. పదేళ్ళపాటు రాష్ట్రాన్ని ఏలిన కేసీఆర్ ఈ మధ్య తన ఫామ్ హౌజ్ అంటే ఏముంటది వరి ఉంటది.. మక్క ఉంటది అల్లం ఉంటది దీనికి ఫామ్ హౌజ్ అని మనల్ని బద్నాం చేసిండ్రు అంటూ కేసీఆర్ ఈ మధ్య జహీరాబాద్ కార్యకర్తలతో అన్నారు. సీఎంగా ఉన్నపుడు నాఫామ్ హౌజ్ లో అడుగుపెట్టు ఆరుముక్కలైతవు అంటూ గతంలో బిజెపి చీఫ్ గా ఉన్న బండిసంజయ్ ను హెచ్చరించారు.

### డైలీ డ్రైవింగ్


మాజీ సీఎం కేసీఆర్ .. ఇపుడు యాక్టివ్ గా ఉంటున్నారు. కేసీఆర్ ఫామ్ ను విస్తరించుకుంటూ వెళ్ళిపోగా.. ఫామ్ హౌజ్ లో భూములు కోల్పోయిన పలువురు ఎఎన్ఎన్ తో మాట్లాడారు. ఈఏడాది కేసీఆర్ తన వ్యవసాయ పంటలను మార్చేశాడు. ప్రతీరోజూ కారును స్వయంగా డ్రైవ్ చేస్తూ తన పంటలను, భూములను కేసీఆర్ స్వయంగా చూసుకుంటున్నాడు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా చేసినా.. తమ బతుకులు పెద్దగా మారలేదంటూ పలువురు స్థానికులు తమ బాధలు చెప్పకున్నారు.



ఏఎన్ఎన్ గ్రౌండ్ రిపోర్ట్ మహా REPORT

పూర్తి ఎపిసోడ్ కోసం బుధవారం రాత్రి 8 గంటలకు ఎఎన్ఎన్ ఛానల్ చూడండి





## ఖమ్మం గుమ్మంలో

# సీతారామం

### త్వరలో పరవళ్లు తొక్కనున్న గోదావరి జలాలు!

టీఏసీ అనుమతులతో పనులకు కొత్త ఊపు

10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించనున్న సీతారామ

సావధానంగా దస్త్రాలను సిద్ధం చేసిన అధికార యంత్రాంగం

సవరించిన అంచనాలకు ఆమోదం కోరిన మంత్రి తుమ్మల

**ఖమ్మం, మహా:** ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయాలని, లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే తన కలను సాకారం చేసేందుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చురుకైన చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా సీతారామ ఎత్తిపోతల పథకం, సీతమ్మ సాగర్ బ్యారేజీ నిర్మాణ పనులకు పూర్తి వేగం తీసుకొచ్చేందుకు టీఏసీ అనుమతుల దస్త్రాలను సిద్ధం చేసి అధికారులను అప్రమత్తం చేశారు.

మిగతా 2లో

## దమ్ముంటే ఎమ్మెల్సీ ఎన్నికల్లో

# పోటీ చేయండి



- చెల్లి, బావ ఇచ్చిన షాక్‌తో కేటీఆర్ కు మతిభ్రమించింది
- కులగణన, వర్గీకరణపై చర్చకు సిద్ధమా?
- కేటీఆర్‌కు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సవాల్

**హైదరాబాద్, మహా:** దమ్ముంటే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ సవాల్ చేశారు. మంగళవారం మహేశ్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడారు.

మిగతా 2లో



న్యాయపరమైన చిక్కులు లేకుండా


## ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చేశాం

సీఎం రేవంత్‌రెడ్డి

### సీఎంతో మందకృష్ణ మాదిగ భేటీ

వర్గీకరణకు అనుకూలంగా తీర్మానం చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు

నివేదికలోని లోపాలు సవరించాలని సీఎంను కోరిన మందకృష్ణ



కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

## వరంగల్ పర్యటన రద్దు

- ఆకస్మిక పర్యటనతో నేతల హైరానా
- వరంగల్‌కు పీసీసీ చీఫ్ మహేష్

02

## కుంభమేళాకు వెళ్లొస్తుండగా ఘోర ప్రమాదం

- 8 మంది దుర్మరణం..
- మృతులందరూ హైదరాబాద్ వాసులే
- మినీ బస్సును ఢీకొన్న కారు..
- కారులోని ప్రయాణికులు క్షేమం

02

## తెలంగాణలోనూ కేరళ మోడల్

- గ్రామాల స్వయం సమృద్ధికి యాక్షన్ ప్లాన్
- పంచాయతీల బలోపేతంపై ప్రత్యేక దృష్టి
- మంత్రి సీతక్కతో క్రిస్ప్ సంస్థ భేటీ
- పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో నివేదన



02

## వేసవి కాలం అలర్ట్‌గా ఉండండి

- డిమాండ్ కు తగ్గ విద్యుత్ ను అందించాల్సిందే
- రెప్పపాటు కూడా అంతరాయం ఏర్పడవద్దు
- 1912 నెంబర్ వినియోగదారులందరికీ చేరాలి
- ఉత్తమ సేవలు అందించే సిబ్బందికి పురస్కారాలు
- విద్యుత్ అధికారుల సమీక్ష సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- అవసరమైతే నాతోనూ మాట్లాడొచ్చు

02

# ఖమ్మం గుమ్మంలో సీతారామం

## త్వరలో పరవళ్లు తొక్కనున్న గోదావరి జలాలు!

టీఏసీ అనుమతులతో పనులకు కొత్త ఊపు
10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించనున్న సీతారామ
సావధానంగా దస్త్రాలను సిద్ధం చేసిన అధికార యంత్రాంగం
సవరించిన అంచనాలకు ఆమోదం కోరిన మంత్రి తుమ్మల



(మొదటి పేజీ తరువాయి)

ఢిల్లీలో మంగళవారం జరిగిన టీఏసీ సమావేశంలో ఈ ప్రాజెక్టు దస్త్రాలను సమర్పించిన అధికారుల బృందం, కీలక అనుమతుల కోసం కృషి చేసింది.

**టీఏసీ ముందుకు ప్రాజెక్టు ప్రతిపాదనలు**

సీతారామ ఎత్తిపోతల పథకానికి సంబంధించిన సాంకేతిక అనుమతుల దస్త్రం టెక్నికల్ అడ్వైజరీ కమిటీ (టీఏసీ) ముందు ప్రవేశపెట్టారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలో గోదావరిపై నిర్మిస్తున్న సీతమ్మ సాగర్ బ్యారేజీ ద్వారా ఖమ్మం, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ ప్రాజెక్టును అమలు చేస్తోంది. దీనికి అవసరమైన అనుమతుల కోసం ఇప్పటికే ఇతర ప్రభుత్వ విభాగాలతో సంప్రదింపులు జరిపారు.

**సవరించిన అంచనాలకు ఆమోదం – సీఎం రేవంత్‌కు లేఖ**

సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు అంచనాలను రాష్ట్ర ప్రభుత్వం సవరించిన నేపథ్యంలో, తక్షణమే ఆమోదం కోరుతూ సీఎం రేవంత్ రెడ్డికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ రాశారు. కొత్త అంచనాలను ఆమోదించి, పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తే ప్రాజెక్టు పనులు వేగంగా పూర్తవుతాయని ఆయన స్పష్టం చేశారు. ''ఈ ఏడాదిలోనే ప్రాజెక్టును పూర్తి చేసి సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలి'' అని సీఎం రేవంత్‌ను కోరారు.

**10 లక్షల ఎకరాలకు సాగునీరు – ఖమ్మం, మహబూబాబాద్‌కు వరం**

సీతారామ ప్రాజెక్టు పూర్తయితే, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందనుంది. అంతేకాదు, సీతమ్మ సాగర్ బ్యారేజీ నిర్మాణంతో భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లోని పలు మండలాలకు తాగునీరు కూడా అందించనున్నారు. ప్రధానంగా ఏన్కూర్ లింక్ కెనాల్, సత్తుపల్లి లింక్ కెనాల్ ద్వారా గోదావరి జలాలను ఖమ్మం జిల్లాలో ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

**సీతారామం ప్రాజెక్టు – తుమ్మల కల సాకారం.**

ఖమ్మం గుమ్మంలో సీతారామ ప్రాజెక్టు పరవళ్లు తొక్కడం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రాజకీయ జీవితంలో ఓ గొప్ప మైలురాయిగా మారనుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే, గోదావరి జలాలు ఖమ్మం, మహబూబాబాద్, భద్రాద్రి జిల్లాల్లో ప్రవహిస్తాయి. సాగునీరు, తాగునీరు సమస్యకు శాశ్వత పరిష్కారంగా మారనుంది. ''సీతారామ ప్రాజెక్టును పూర్తి చేయడం నా కల... ప్రజలకు వాగ్దానం. దానిని సాధించే వరకు నా కృషి ఆగదు,'' అని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.

**టీఏసీ అనుమతుల తర్వాత పనులకు కొత్త ఊపు.**

ప్రాజెక్టు పనులకు టీఏసీ అనుమతులు లభించిన వెంటనే పనులు మరింత వేగంగా సాగుతాయని అధికారులు తెలిపారు. ఇప్పటికే ప్రాజెక్టుకు సంబంధించిన అనేక అనుమతులు లభించాయి. నిర్మాణానికి అవసరమైన అన్ని వనరులు సిద్ధంగా ఉంచామని అధికారులు వెల్లడించారు. ''ఈ ఏడాదిలోనే ప్రాజెక్టు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తాం'' అని మంత్రి తుమ్మల ప్రకటించారు.

# ఏఐతో జాగ్రత్త



**మహా :** శాస్త్ర సాంకేతిక రంగాల్లో శరవేగంగా వస్తున్న ప్రస్తుత పరిస్థితులలో ఆర్టిఫిషియల్ ఇంటలీజెన్స్ (ఏఐ) ఎంతో అవసరమని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లోని గ్రాండ్ ప్యాలెస్ లో జరిగిన ఏఐ యాక్షన్ సమ్మిట్ లో ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగించారు. ఏఐ యాక్షన్ కమిటీ సమావేశానికి నరేంద్ర మోడీ అధ్యక్షత వహించారు. పలు దేశాధినేతలు, టెక్ రంగ నిపుణులను ఉద్దేశించి ప్రధాని మోడీ ప్రసంగించారు. ఏఐ ఇప్పటికే మన ఆర్థిక వ్యవస్థను, భద్రతను, మన సమాజాన్ని కూడా పునర్నిర్మిస్తోందని, ఈ శతాబ్దంలో మానవాళికి ఏఐ కోడ్ ను రాస్తోందని ప్రధాని మోడీ అన్నారు. నేటి సమాజానికి ఏఐ అవసరమన్నారు. ప్రపంచంలోనే ప్రతిభావంతులు మన దగ్గర ఉన్నారన్నారు. ప్రజల డేటాను సురక్షితంగా ఉంచడానికి ఏర్పాట్లు చేస్తామన్నారు. ఏఐ భవిష్యత్తు ఇంకా చాలా ప్రకాశవంతంగా ఉంటుందన్నారు. యంత్రాల శక్తి పెరుగుతుండడంతో కొందరు ఆందోళన చెందుతున్నారని, కానీ ఆందోళన చెందడానికి ఏమీ లేదన్నారు. ఏఐ విషయంలో దేశాలన్నీ ఐక్యంగా ముందుకెళ్లాలని సూచించిన ప్రధాని, ఏఐ పరిజ్ఞానంతో వచ్చే మార్పుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఏఐ కొత్త ఉద్యోగ అవకాశాలను సృష్టిస్తోందని లక్షలాది మంది జీవితాలను మారుస్తోందన్నారు. కాలంతో పాటు ఉపాధి స్వభావం కూడా మారుతోందంటూ ఏఐ వల్ల కలిగే ఉపాధి సంక్షోభంపై మనం శ్రద్ధ వహించాలన్నారు. సాంకేతికత ఉద్యోగాలను తీసివేయదని చరిత్ర సాక్ష్యంగా ఉందని ప్రధాని మోడీ వ్యాఖ్యానించారు. ఉద్యోగాలు పోతాయి అనేది వదంతేనని, ఏఐ మన రాజకీయాలు, ఆర్థిక వ్యవస్థ, భద్రత, సమాజాన్ని సానుకూల రీతిలో మారుస్తోందన్నారు. ఏఐ వల్ల మనం చేసే అన్ని పనుల్లో మార్పులు వస్తాయన్నారు. ప్రస్తుతం ఏఐతో ఉద్యోగాలు పోతాయనే వదంతు ప్రచారంలో ఉందన్నారు. కొత్త రకం ఉద్యోగాల సృష్టి జరుగుతోందని, వాటిని అందిపుచ్చుకోవడం కోసం స్కిల్లింగ్, రీస్కిల్లింగ్ అవసరమన్నారు. ఉద్యోగాల్లో నైపుణ్యం పెంచుకునే వారికే ఉన్నత అవకాశాలు ఉంటాయన్నారు. డిజిటల్ మార్కెట్, వాణిజ్యం దిశగా ఇండియా ముందుకు వెళ్తోందన్నారు. ఆరోగ్యం, విద్య, వ్యవసాయం వంటి రంగాలను మెరుగుపర్చడం ద్వారా కోట్లాది మంది జీవితాలను మార్చడంలో ఏఐ సహాయపడుతుందని ఆయన స్పష్టం చేశారు.

# ఉప ఎన్నికలు ఖాయం

- స్టేషన్ ఘన్ పూర్ లో శ్రీహరి పోయి రాజయ్య గెలుస్తారు
- పది స్థానాల్లో శాసనసభ్యుల ఓటమి తథ్యం
- ఫామ్ హౌస్ లో రాజయ్యతో కేసీఆర్



**గజ్వేల్, మహా:** పార్టీ మారిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో తప్పకుండా ఉపఎన్నికలు వస్తాయని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. మంగళవారం ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌లో మాజీ ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య.. కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరఫున పోటీ చేసి గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు.. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ నేపథ్యంలోనే పార్టీ మారిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు రావడం ఖాయమని కేసీఆర్ తెలిపారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు ఆయా నియోజకవర్గాల్లోని ప్రజలు బాగా బుద్ధి చెబుతారని కేసీఆర్ వ్యాఖ్యానించారు. ఇక తాటికొండ రాజయ్యతో మాట్లాడిన కేసీఆర్.. స్టేషన్ ఘన్‌పూర్‌లోనూ ఉప ఎన్నిక వస్తుందని తేల్చి చెప్పారు. ఆ బై పోల్స్‌లో ప్రస్తుత స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఓడిపోయి తాటికొండ రాజయ్య ఎమ్మెల్యేగా గెలుస్తారని కేసీఆర్ జోస్యం చెప్పారు. తాటికొండ రాజయ్య గెలుపును ఎవరూ ఆపలేరని ధీమా వ్యక్తం చేశారు. ఒక్క స్టేషన్ ఘన్‌పూర్‌లోనే కాదు.. మొత్తం 10 స్థానాలకు ఉపఎన్నికలు వస్తాయని.. ఆ 10 స్థానాల్లో పార్టీ మారిన శాసనసభ సభ్యులు ఓడిపోవడం ఖాయమని కేసీఆర్ స్పష్టం చేశారు.

# కుంభమేళాకు వెళ్లొస్తుండగా ఘోర ప్రమాదం

## 8 మంది దుర్మరణం.. మృతులందరూ హైదరాబాద్ వాసులే

మినీ బస్సును ఢీకొన్న కారు.. కారులోని ప్రయాణికులు క్షేమం



**మహా :** మధ్యప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. తెలంగాణకు చెందిన 8 మంది మృతి చెందారు. కుంభమేళాకు వెళ్లి తిరిగి వస్తుండగా ఘటన చోటుకుంది. యాత్రికులు ప్రయాణిస్తున్న మినీ బస్సును ఎదురుగా వస్తున్న సిమెంట్ లారీ ఢీకొట్టడంతో ఘోరం జరిగింది. మంగళవారం ఉదయం 8 గంటలలకు మధ్యప్రదేశ్ జబల్‌పుర్‌లోని సిహోరా ప్రాంతంలోని హైవే వంతెనపైకి రాంగ్‌రూటులో వచ్చిన సిమెంట్ లోడ్ లారీ ఎదురుగా వస్తున్న మినీ బస్సును ఢీకొట్టింది. ఈ ఘటనలో మినీ బస్సు తుక్కుతుక్కుగా మారి ఏడుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మరికొందరు దాంట్లో ఇరుక్కుపోయారు. వెంటనే స్పందించిన స్థానికులు క్షతగాత్రుల్ని రక్షించి సిహోరా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మరొకరు మరణించారు. ప్రమాదానికి గురైన వాహనం ఏపీ నంబర్ తో రిజిస్ట్రేషన్ అయి ఉండటంతో మృతి చెందిన వారంతా ఏపీ వాసులని స్థానికులు తొలుత భావించినా మృతదేహాల వద్ద దొరికిన ఆధారాలతో హైదరాబాద్ నాచారంలోని రాఘవేంద్రనగర్ వాసులుగా గుర్తించారు.

ప్రమాదంలో నాచారానికి చెందిన శశికాంత్, మల్లారెడ్డి, రవిప్రకాశ్, సంతోష్‌కుమార్, డ్రైవర్ రాజుతో పాటు దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన ఆనంద్, తార్నాక వాసి టీవీ ప్రసాద్ అనే ఈ ఏడుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మరోకరు చికిత్స పొందుతూ మృతి చెందారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ దుర్ఘటనతో నాచారంలోని బాధితులు ఇళ్ల వద్ద విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుల్లో ఒకరైన శశికాంత్ గచ్చిబౌలిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. అతనికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆనంద్, సంతోష్‌లు బంగారం వ్యాపారులుగా పని చేస్తున్నారు. కుంభమేళాకు వెళ్లిన వీరిలో శశికాంత్, సంతోష్, నవీన్, ఆనంద్‌లు దగ్గరి బంధువులు కాగా మిగిలినవారు స్నేహితులని స్థానికులు తెలిపారు. మరో మృతుడు మల్లారెడ్డి నాచారం కార్తికేయనగర్ కాలనీ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. ఘటనా సమయంలో మినీ బస్సు వెనుకగా వచ్చిన తెలంగాణకు సంబంధించిన కారు సైతం ప్రమాదానికి గురైంది. అదృష్టవశాత్తూ కారులోని ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకోవడంతో అందులోని ప్రయాణికులు క్షేమంగా బయటపడ్డారు. ప్రమాదానికి గురైన కారు వనపర్తి జిల్లా చిన్నమందడి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సూర్యచంద్రారెడ్డిదిగా గుర్తించారు. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న సూర్యచంద్రారెడ్డి చేయి విరగ్గా అందులో ఉన్న మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి.

**సీఎం దిగ్భ్రాంతి**

ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని గాయపడిన వ్యక్తికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. మధ్యప్రదేశ్ ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ మృత దేహాలను స్వగృహాలకు తరలించేందుకు కావాల్సిన ఏర్పాట్లను చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపీ ఈటెల రాజేందర్ సహా పలువురు రాజకీయ ప్రముఖులు ప్రమాద ఘటనపై విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ఘటన విషయం తెలుసుకున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించడంతో పాటు మృతదేహాలను త్వరగా హైదరాబాద్ తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు. ఘటనపై రంగారెడ్డి కలెక్టర్ జబల్‌పూర్ కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి ప్రమాద వివరాలపై ఆరా తీశారు. అనంతరం బాధిత కుటుంబసభ్యులను కూడా ఫోన్‌లో పరామర్శించారు. మేడ్చల్ అదనపు కలెక్టర్ సైతం బాధిత కుటుంబీకులతో మాట్లాడారు.

# లోలోన దాచుకోవొద్దు

## సమస్యను బయటకు చెప్పండి

పరీక్షా పే చర్చలో దీపికా పదుకొణె
వినూత్నంగా నిర్వహిస్తున్న ప్రధాని మోదీ
పూర్తి వీడియో నేడు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

ఇందుకు సంబంధించిన వీడియోను తాజాగా ఆమె తన ఇన్‌స్టా ఖాతాలో పంచుకున్నారు. ''చిన్నప్పుడు స్కూల్లో నేనూ సోఫాలు, టేబుల్స్, కుర్చీలు ఎక్కి అల్లరి చేసేదాన్ని. చదువుకునే రోజుల్లో చాలా ఒత్తిడి ఉంటుంది. ఉదాహరణకు నాకు లెక్కలంటే చాలా భయం. ఇప్పటికీ అందులో నేను వీక్‌గానే ఉంటా. అయితే, ఆ భయాన్ని అధిగమించాలి. ప్రధాని మోదీ రాసిన 'ఎగ్జామ్ వారియర్స్' పుస్తకంలో వివరించినట్లుగా.. సమస్యను లోలోపల అణచిపెట్టుకోకుండా.. బయటకు చెప్పాలి. మీ తల్లిదండ్రులు, స్నేహితులు, కుటుంబసభ్యులు, టీచర్లతో పంచుకోవాలి. జర్నల్ లేదా డైరీ రాయడం అలవాటు చేసుకోవాలి. మిమ్మల్ని మీరు వ్యక్తపర్చుకోవడం కోసం అది గొప్ప మార్గం'' అని దీపిక వివరించారు. తాను కూడా ఒక దశలో కుంగుబాటు సమస్యను ఎదుర్కొన్నట్లు నటి ఈసందర్భంగా తెలిపారు. దీపిక ఎపిసోడ్‌కు సంబంధించి తాజాగా ట్రైలర్ మాత్రమే పంచుకున్నారు. పూర్తి వీడియోను ఫిబ్రవరి 12న ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నారు. ఈసందర్భంగా ప్రధాని మోదీకి దీపిక కృతజ్ఞతలు తెలియజేశారు. మానసిక ఆరోగ్యంపై అవగాహన చాలా ముఖ్యమని అభిప్రాయపడ్డారు.

# నిరాశ, నిస్పృహలో ఉన్నాం

అందుకే ఎమ్మెల్సీ ఎన్నికలకు బీఆర్ఎస్ దూరం
బీజేపీతో లోపాయికారి ఒప్పందం లేనేలేదు
మాజీ ఎంపీ వినోద్ కుమార్ కీలక వ్యాఖ్యలు



**మహా :** అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమితో బీఆర్ఎస్ నేతలం నిరాశ, నిస్పృహలో ఉన్నామని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ కీలక కామెంట్స్ చేశారు. ఉన్న మాటే చెబుతున్నానుని, దీనిలో దాపరికం ఏమీ లేదని చెప్పారు. ఇవాళ(మంగళవారం) తెలంగాణ భవన్‌లో వినోద్ కుమార్ మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మీడియాతో వినోద్ కుమార్ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ మధ్య లోపాయికారీ ఒప్పందం లేదన్నారు. గ్రాడ్యుయేట్ ఎన్నికలకు పార్టీ సన్నద్ధం కాలేదని, ఓటరు నమోదు కార్యక్రమంలో పాల్గొనలేదన్నారు. అందుకే ఎమ్మెల్సీ ఎన్నికలకు దూరంగా ఉన్నామని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో తప్పిదాలున్నాయన్నారు. గతంలో కూడా బీఆర్ఎస్ పోటీ చేయని సందర్భాలు ఉన్నాయని అన్నారు.

**జన గణన చేపట్టాలి**

మోదీ సర్కార్ వెంటనే దేశంలో జనాభా లెక్కింపు జరపాలని డిమాండ్ చేశారు. కులగణన నుంచి తప్పించుకోవటానికే మోదీ జనగణన చేయటం లేదని విమర్శించారు. డీ లిమిటేషన్, మహిళా రిజర్వేషన్లు నుంచి తప్పించుకోవాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. డీ లిమిటేషన్ జరిగితే తెలంగాణలో అసెంబ్లీ సీట్లు పెరుగుతాయని చెప్పారు. 2026లో అసెంబ్లీ సీట్లు పెరుగుతాయని విభజన చట్టంలో ఉందని చెప్పుకొచ్చారు. 2021లో జరగాల్సిన జనాభా లెక్కలు కోవిడ్ ప్రభావం వల్ల వాయిదా పడ్డాయన్నారు. గుడ్డి ఎద్దు చేనులో పడినట్లు మోదీ పాలన చేస్తున్నారని ఆక్షేపించారు. 2011లో నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్ యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిందని గుర్తుచేశారు. పేదలకు రేషన్ ఇవ్వటం ఇష్టంలేకనే జనాభా లెక్కలకు వెనకడుగు వేస్తున్నారని తెలిపారు. జనాభా లెక్కింపు జరిపితే కొత్తగా 10కోట్ల మందికి కొత్త రేషన్ కార్డులు వస్తాయని వినోద్ కుమార్ పేర్కొన్నారు.

# కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ వరంగల్ పర్యటన రద్దు

## ఆకస్మిక పర్యటనతో నేతల హైరానా.. వరంగల్‌కు పీసీసీ చీఫ్ మహేష్



**హైదరాబాద్, మహా :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ వరంగల్ పర్యటన రద్దయింది. మంగళవారం సాయంత్రం ఆయన హైదరాబాద్ వచ్చి.. ఆ తర్వాత వరంగల్ వెళ్లనున్నట్లు పార్టీ వర్గాలు తొలుత తెలిపాయి. వరంగల్‌లో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలతో ఆయన సమావేశం కానున్నట్లు వెల్లడించాయి. అక్కడి నుండి తమిళనాడుకు రైల్లో వెళ్ళేలా షెడ్యూల్ ఉందని చెబుతూ, రాహుల్ వెంట సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ తదితరులు వరంగల్ వెళ్తారని భావించారు. అయితే పార్లమెంట్ సమావేశాల కారణంగా రాహుల్‌గాంధీ తన పర్యటనను తాజాగా రద్దు చేసుకున్నట్లు సమాచారం. రాహుల్ వస్తారని ఉదయమే పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ వరంగల్ వెళ్ళిపోయారు. అయితే పార్లమెంట్ సమావేశం చర్చల్లో ఉండాల్సిన పరిస్థితి ఉండడంతో పర్యటన వాయిదా పడినట్లు మహేష్ కుమార్ గౌడ్ ప్రకటించారు.

# దమ్ముంటే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయండి




(మొదటి పేజీ తరువాయి)

పదేళ్ల బీఆర్ఎస్ పాలన..ఏడాది కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధమా? అని కేటీఆర్‌కు ఛాలెంజ్ చేశారు. కేటీఆర్ ఉత్తర కుమారుడి ప్రగల్భాలు పలకడం ఆపేసి.. దమ్ముంటే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసి చూపాలన్నారు. ఎన్నికలకు పారిపోయి కల్లబొల్లి మాటలు చెబుతున్నారన్నారు. చెల్లి, బావ ఇచ్చిన షాక్‌తో కేటీఆర్ మతిభ్రమించి మాట్లాడుతున్నాడని విమర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బీఆర్ఎస్ లోపాయికారీ ఒప్పందంపై కూడా తాను చర్చకు సిద్ధమని మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటన చేశారు. బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణపై చర్చకు ఎక్కడికి రమన్నా వస్తామని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి గురించి మాట్లాడే నైతిక అర్హత కేటీఆర్‌కు లేదని మండిపడ్డారు. కేసీఆర్, హరీష్ రావు, కేటీఆర్ ప్రాతినిథ్యం వహిస్తున్న జిల్లాల్లో పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు సున్నా ఇచ్చినా బుద్ధి మారడం లేదని మండిపడ్డారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ గాడిద గుడ్డే వస్తదని హాట్ కామెంట్స్ చేశారు. ఇప్పటివరకు బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించలేదని.. ఇక్కడే మీ దమ్ము ఏంటో తెలిసిపోయిందని విమర్శించారు. బీఆర్ఎస్ పదేళ్ల విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని సీఎం రేవంత్ రెడ్డి, మంత్రుల బృందం పునర్వికాసం వైపు నడిపిస్తోందని తెలిపారు. మూడు ముక్కలుగా చీలిన బీఆర్ఎస్ పార్టీ.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి తెలంగాణ రాజకీయ ముఖచిత్రంలో కనిపించదని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

# వేసవి కాలం అలర్ట్‌గా ఉండండి

## డిమాండ్ కు తగ్గ విద్యుత్ ను అందించాల్సిందే

రెప్పపాటు కూడా అంతరాయం ఏర్పడవద్దు
1912 నెంబర్ వినియోగదారులందరికీ చేరాలి
ఉత్తమ సేవలు అందించే సిబ్బందికి పురస్కారాలు
విద్యుత్ అధికారుల సమీక్ష సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి
అవసరమైతే నాతోనూ మాట్లాడొచ్చు



**మహా :** రానున్న వేసవిలో డిమాండ్ మేరకు విద్యుత్తును అందుబాటులోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. సచివాలయంలో ఎస్‌పీడీసీఎల్ పరిధిలోని విద్యుత్ అధికారులతో వేసవిలో విద్యుత్ సరఫరా ప్రణాళికపై సమీక్ష నిర్వహించారు. గత వేసవిలో వచ్చిన విద్యుత్ డిమాండ్, రానున్న వేసవిలో ఏ మేరకు విద్యుత్తు డిమాండ్ ఉంటుంది, అందుకు తగిన విధంగా అధికారుల ప్రణాళికలపై డిప్యూటీ సీఎం సమీక్షించారు. క్షేత్రస్థాయిలో అవసరాల మేరకు అధికారులు కోరిన అన్ని వసతులు కల్పించిన నేపథ్యంలో రానున్న వేసవిలో క్షణం కూడా విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరా అనేది సున్నితమైన అంశం, నిత్యవసరం కూడా ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకొని నిరంతరం అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. వేసవి ప్రణాళికపై అన్ని స్థాయిల్లో అధికారులు వెనువెంటనే సమావేశం నిర్వహించుకుని క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనేందుకు ఏ రీతిలో సన్నద్ధంగా ఉన్నారు, వినియోగదారులకు సైతం అవగాహన కల్పించాన్నారు. విద్యుత్ శాఖలో లైన్ మెన్ మొదలు విద్యుత్ శాఖ మంత్రి వరకు ఒక కుటుంబంగా పనిచేయాలని, క్షేత్రస్థాయిలో ఏ సమస్య వచ్చినా వెంటనే పై అధికారికి ఫోన్ చేయాలని వారు స్పందించని పక్షంలో ఆపై అధికారికి అలా నాకు కూడా ఫోన్ చేయవచ్చని సిబ్బందికి డిప్యూటీ సీఎం భరోసా ఇచ్చారు. మీకు క్షేత్రస్థాయిలో కావలసిన వసతులు, సౌకర్యాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నాం, ఏదైనా అడగవచ్చని అధికారులకు డిప్యూటీ సీఎం తెలిపారు. హైదరాబాద్ నగరంలో ఎమర్జెన్సీ వాహనాల ద్వారా కొనసాగుతున్న విద్యుత్ సేవలు గ్రామీణ ప్రాంతాలకు సైతం విస్తరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అధికారులు కోరిన అన్ని అనుమతులు ఇచ్చాం, మార్చి మొదటి తేదీ నాటికి సబ్ స్టేషన్ల నిర్మాణం ఇతర పనులు పూర్తి చేసుకోవాలని ఆదేశించారు. గత మూడు సంవత్సరాలుగా సబ్ స్టేషన్ లపై పెరుగుతున్న లోడ్ భారం వివరాలను డిప్యూటీ సీఎం సమీక్షించారు.

**సిబ్బందికి ప్రోత్సాహకాలు**

బాగా పని చేసే వారికి ప్రోత్సాహకంగా అవార్డులు సైతం ఇచ్చే కార్యక్రమాన్ని విద్యుత్ శాఖలో ప్రారంభించాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. మొన్నటి భారీ వరదల సమయంలో అర్ధరాత్రి కూడా విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు సిబ్బంది తీవ్రంగా శ్రమించారని అటువంటి వారిని గుర్తించాలని డిప్యూటీ సీఎం అన్నారు. విద్యుత్ రంగంలో వస్తున్న మార్పులపై అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్, ప్రత్యామ్నాయ విద్యుత్తు ఉత్పత్తి ఈ రంగంలో ప్రపంచంలో వస్తున్న మార్పులపై సిబ్బందికి అవగాహన అవసరమని అభిప్రాయపడ్డారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన డయల్ 1912 కు విస్తృతంగా ప్రచారం కల్పించాలన్నారు. ఇలాంటి సేవలు అందుబాటులో ఉన్నాయని ప్రతి వినియోగదారునికి తెలిసేలా వారి మొబైల్ నెంబర్ కు 1912 ఎస్ఎంఎస్ చేయాలని, కరెంటు బిల్లుపై సైతం 1912 సేవల గురించి ప్రచురించాలని ఆదేశించారు. ఈ విభాగాన్ని పటిష్టం చేసేందుకు సిబ్బంది సంఖ్య పెంచడం, సాంకేతికంగా అదనపు హంగులు కల్పించేందుకు అవసరమైన నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. స్టోర్స్ లో అందుబాటులో ఉన్న సామాగ్రి, రాబోయే రోజుల్లో డిమాండ్ కు తగిన విధంగా చేసుకుంటున్న ఏర్పాట్లపై వివిధ విభాగాల్లో ఉన్న సీఈలతో ప్రత్యేకంగా డిప్యూటీ సీఎం సమీక్ష చేశారు. గత ఏడాదికి వస్తున్న సమస్యల్లో తేడాలు, ఫిర్యాదులు తగ్గడానికి చేపట్టిన చర్యలను అధికారుల ద్వారా డిప్యూటీ సీఎం అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్, ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ, ఇంధన శాఖ ఓఎస్డి సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యాయపరమైన చిక్కులు లేకుండా


# ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చేశాం

**సీఎం రేవంత్‌రెడ్డి**

## సీఎంతో మందకృష్ణ మాదిగ భేటీ

**వర్గీకరణకు అనుకూలంగా తీర్మానం చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు**

**నివేదికలోని లోపాలు సవరించాలని సీఎంను కోరిన మందకృష్ణ**



**హైదరాబాద్:** తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ భేటీ అయ్యారు. ఎమ్మార్పీఎస్ నేతలతో కలిసి సీఎంతో ఆయన సమావేశమయ్యారు. జస్టిస్ షమీమ్ అక్తర్ నివేదికలోని లోపాలను సీఎం రేవంత్ దృష్టికి మందకృష్ణ తీసుకెళ్లారు. ఎస్సీ వర్గీకరణ, రిజర్వేషన్లపై సీఎంతో చర్చించారు. సీఎంతో జరిగిన ఈ భేటీలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కె.కేశవరావు, వేం నరేందర్‌రెడ్డి, సంపత్ కుమార్, మాదిగ ఉపకులాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, సుప్రీంకోర్టు తీర్పు రాగానే ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై అసెంబ్లీలో చర్చించామని గుర్తు చేశారు. రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా మేలు చేస్తామని, మాదిగ, మాదిగ ఉపకులాలకు మేలు చేసే లక్ష్యంతో ఉన్నామని పేర్కొన్నారు. కేబినెట్ సబ్‌కమిటీ, న్యాయకమిషన్ వేసి అధ్యయనం చేయించామని, వేగంగా నివేదిక తీసుకుని, కేబినెట్‌లో చర్చించి, అసెంబ్లీలో ప్రవేశపెట్టామని తెలిపారు. ఎలాంటి న్యాయపరమైన చిక్కులు లేకుండా చేశామని అన్నారు.

**ఎస్సీలను మూడు కాదు నాలుగు గ్రూపులు చేయాలి**

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు అనుకూలంగా తీర్మానం చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలకు ధన్యవాదాలు తెలుపుతున్నామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ అన్నారు. మంగళవారం సీఎం రేవంత్‌తో భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జస్టిస్ షమీమ్ అక్తర్ నివేదికపై ప్రభుత్వానికి కొన్ని సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. ''సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన వెంటనే ఎస్సీ వర్గీకరణ చేశారు. ఇందులో రేవంత్‌రెడ్డి భాగస్వామ్యం అయ్యారు. అందుకే వారికి ధన్యవాదాలు తెలిపాం. అయితే, జస్టిస్ షమీమ్ అక్తర్ నివేదికలో కొన్ని లోపాలున్నాయి. ఎస్సీలను 1,2,3 గ్రూపులుగా కాకుండా ఏ, బీ, సీ, డీలుగా వర్గీకరించాలి. నివేదికలో ఉన్న లోటుపాట్లను సరిచేస్తారని ఆశిస్తున్నాం''అని మందకృష్ణ అన్నారు.

# తెలంగాణలోనూ కేరళ మోడల్

- గ్రామాల స్వయం సమృద్ధికి యాక్షన్ ప్లాన్
- పంచాయతీల బలోపేతంపై ప్రత్యేక దృష్టి
- మంత్రి సీతక్కతో క్రిస్ప్ సంస్థ భేటీ
- పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో నివేదన



**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాష్ట్రంలోనూ గ్రామ పంచాయతీల బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. గ్రామ పంచాయతీలను స్వయం సమృద్ధిగా మార్చే ప్రణాళికలు, స్థానిక ప్రభుత్వాల్లో సంస్కరణలు తెచ్చే దిశలో యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా రాష్ట్ర సచివాలయంలో మంగళవారం మంత్రి సీతక్కతో (సీఆర్ఐఎస్పీ) క్రిస్ప్ సంస్థ మెంబర్ సెక్రటరీ, భారత ప్రభుత్వ మాజీ కార్యదర్శి, రిటైర్డ్ ఐఏఎస్ ఆర్. సుబ్రహ్మణ్యం భేటీ అయ్యారు. తమ సంస్థ కార్యకలాపాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రి సీతక్కకు సుబ్రహ్మణ్యం నివేదించారు. ఆయా రాష్ట్రాల్లో ఆయా రంగాల్లో తీసుకొచ్చిన సంస్కరణలు, ఫలితంగా సాధించిన పురోగతిని మంత్రికి వివరించారు. కేరళ మాజీ చీఫ్ సెక్రటరీ విజయానంద్ అధ్యక్షతన, 10 మంది సీనియర్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారుల ఆధ్వర్యంలో క్రిస్ప్ సంస్థ పని చేస్తున్నట్లు తెలిపారు. కేరళ గ్రామ పంచాయతీల బలోపేతం కోసం విజయానంద్ కృషి చేసినట్లు వెల్లడించారు.

**ప్రత్యేక సంస్కరణలు**

విజయానంద్ అనుభవాలతో తెలంగాణలో గ్రామపంచాయతీల బలోపేతం, గ్రామాల అభివృద్ధి కోసం సంస్కరణలు చేపట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు మంత్రి సీతక్క తెలిపారు. గ్రామ పంచాయతీల కార్యకలాపాల్లో మహిళ స్వయం సహాయక బృందాల సహకారం తీసుకోవాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది. మహిళా సంఘాలు, గ్రామపంచాయతీల మధ్య సమన్వయం సాధిస్తే గ్రామాల్లో అద్భుతాలు సృష్టించవచ్చు.. కేరళ మోడల్లో ఈ విధానం సక్సెస్ అయిందన్న అభిప్రాయంలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది. ఆ దిశలో కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ఇవ్వాలని సంస్థ సెక్రటరీ సుబ్రహ్మణ్యం కి మంత్రి సీతక్క సూచించారు. యాక్షన్ ప్లాన్ క్యాబినెట్ లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు.

**స్వయం సమృద్ధి దిశగా..**

గ్రామ సభల నిర్వహణ, గ్రామ పంచాయతీలను స్వయం సమృద్ధిగా మార్చే ప్రణాళికలు, స్థానిక ప్రభుత్వాల్లో సంస్కరణలు తెచ్చే దిశలో యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని మంత్రి సీతక్క కోరారు. స్థానిక ఎన్నికలు పూర్తయి కొత్త పాలకమండళ్లు ఏర్పడే నాటికి యాక్షన్ ప్లాన్ ఖరారు చేయాలని సూచన ఇచ్చింది. ఈ క్రమంలోనే ప్రభుత్వంతో క్రిస్ సీఆర్ఐఎస్పీ (క్రిస్ప్) సీతక్క సమక్షంలో క్రిస్ప్ మెంబర్ సెక్రటరీ సుబ్రహ్మణ్యం, సీఆర్డీ డైరెక్టర్ సృజన ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. 14 రాష్ట్రాల్లో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి క్రిస్ప్ సంస్థ పనిచేస్తున్నదని, ఆయా రాష్ట్రాలకు ఉచితంగా సంస్థ సేవలందిస్తున్నదని రిటైర్డ్ ఐఏఎస్ తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవానికి

# ఖమ్మం మంత్రులు కుట్రలు

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**హైదరాబాద్, ఖమ్మం, మహా:** పోలీసులను అడ్డం పెట్టుకొని ఖమ్మం జిల్లాలోని ముగ్గురు మంత్రులు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవానికి కుట్రలు చేస్తున్నారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు. ఆ కుతంత్రాలను గులాబీ దండు అడ్డుకుంటుందన్నారు. ఖమ్మం జిల్లాలో 2014 తర్వాత భారాస ప్రభుత్వం అసాధారణ అభివృద్ధి చేసిందని, పువ్వాడ అజయ్ వంటి మంచి నాయకుడు ఓడిపోవడం బాధాకరమని అన్నారు. హైదరాబాద్‌లోని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ నివాసంలో జరిగిన ఖమ్మం జిల్లా బీఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశానికి కేటీఆర్ హాజరయ్యారు. ''తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ అరచేతిలో స్వర్గం చూపించి అధికారంలోకి వచ్చింది. జిల్లాలోని ప్రత్యేక రాజకీయ సమీకరణాల వల్ల భారాసకు నష్టం జరిగింది. ఓడిపోయినా కూడా ప్రజలకు కష్టం వస్తే భారాస నాయకులు, శ్రేణులు ఏడాది కాలంగా ప్రజలకు అండగా ఉంటున్నారు. ఖమ్మంలో ఇటీవల వరదలు వస్తే ప్రజలకు పువ్వాడ అజయ్ గుర్తుకొచ్చారు. డిప్యూటీ సీఎం సహా ఖమ్మంలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ వరదల సమయంలో వారితో పైసా ఉపయోగం లేదు. కేసీఆర్ సీఎంగా లేకపోవడంతో ఎంతో నష్టపోయామన్న భావనతో ప్రస్తుతం తెలంగాణ ప్రజలు ఉన్నారు. రాష్ట్రంలోని ప్రతి వర్గాన్ని మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధిచెప్పాలి. ఏడాది కాలంగా కేసులు పెట్టి వేధిస్తున్నా.. విచారణల పేరిట పిలిచి జైల్లో పెడతామని బెదిరిస్తున్నా ప్రజా సమస్యలపై రేవంత్‌రెడ్డితో పోరాడాం. భవిష్యత్తులో కూడా కొట్లాడతాం. త్వరలోనే ఖమ్మంలో పర్యటిస్తా''అని కేటీఆర్ తెలిపారు. సమావేశంలో మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధు నాయకులు పాల్గొన్నారు.

ఫాం హౌస్ లో

# క్యాసినో

**64 మంది అరెస్ట్**

**రూ. 30 లక్షల నగదు, 55 కార్ లు సీజ్**



**మహా:** హైదరాబాద్ శివారులోని ఫామో హౌస్ లో భారీ క్యాసినో పట్టివేత. కోళ్ల పందాలతో పాటు క్యాసినో నిర్వహిస్తున్న ముఠా. విశ్వసనీయ సమాచారం మేరకు ఫామ్ హౌస్ పై దాడి చేసి 64 మందిని పట్టుకున్న రాజేంద్రనగర్ డిసిపి పార్టీ. 30 లక్షల రూపాయల నగదు 55 లగ్జరీ కార్లు సీజ్ చేసిన అధికారులు. 86 పందెం కోళ్ళు.. పెద్ద మొత్తంలో బెట్టింగ్ కాయిన్స్ పేకాట స్వాధీనం. పందెం కోళ్ల కోసం వాడే 46 కోడి కత్తులు కూడా స్వాధీనం. నగరంలోని ప్రముఖులు కలిసి కోడిపందాలు క్యాసినో నిర్వహిస్తున్నట్లుగా గుర్తింపు.. ఫామ్ హౌస్ కేంద్రంగా కోడిపందాలు క్యాసినో నిర్వహణ జరుగుతున్నట్లు గుర్తించిన పోలీసులు.

## లింక్డ్ ఇన్ ఖాతా తెరిచిన కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి

**ఎన్ సీఎమ్ఎమ్ వివరాలు జోడించిన మంత్రి**



**మహా:** ప్రముఖ ప్రొఫెషనల్ నెట్ వర్కింగ్ ప్లాట్‌ఫామ్ లింక్‌డ్‌ఇన్‌లో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి మంగళవారం ఖాతా తెరిచారు. తన తొలి లింక్‌డ్‌ఇన్ పోస్టులో.. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ముందుకు తీసుకెళ్లనున్న నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్ (ఎన్ సీఎంఎం) కు సంబంధించిన వివరాలను పేర్కొన్నారు. ఇటీవల కేంద్ర కేబినెట్ ఆమోదించిన నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్ (ఎన్ సీఎంఎం) లో భాగంగా నైపుణ్యాభివృద్ధి, పరిశోధనలను ప్రోత్సహించేందుకు తాము కట్టుబడి ఉన్నామని తన తొలి పోస్టులో పేర్కొన్నారు. నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్ కు సంబంధించి ఏడు కీలకమైన అంశాలను ఆయన ప్రస్తావించారు. ఎన్‌సిఎంఎం లో భాగంగా 2031 నాటికి ఏకంగా 10 వేల మందికి శిక్షణను అందించాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్నట్లు పోస్టులో పేర్కొన్నారు. క్రిటికల్ మినరల్ మిషన్ భవితవ్యంపై పారిశ్రామికవేత్తలు, నిపుణులతో లింక్‌డ్‌ఇన్ ప్లాట్‌ఫాంపై చర్చించనున్నట్లు వివరించారు. 'ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశ యువతలోని సృజనాత్మకతను గుర్తించి, దానికి నైపుణ్యాభివృద్ధి ద్వారా మరింత పదునుపెట్టి.. నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్ ను ముందుకు తీసుకెళ్లనున్నట్లు ఆయన తెలిపారు. సుస్థిరమైన మైనింగ్ విషయంలో భారత్ అంతర్జాతీయ లీడర్ గా ఎదిగేందుకు ఈ మిషన్ తోడ్పడుతుందని, దేశంలోని నైపుణ్యత కలిగిన మానవ వనరులను తయారు చేసేందుకు పారిశ్రామికవేత్తలు, ఎంట్రప్రెన్యూర్స్ తో ఎప్పటికప్పుడు చర్చలు జరుపుతామని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. క్లీన్ ఎనర్జీ, రక్షణ రంగం, హై టెక్నాలజీ వంటి పరిశ్రమలకు ఎంతో కీలకమైన క్రిటికల్ మినరల్స్ ను అందుబాటులోకి తెచ్చి ఖనిజాల రంగంలో ఆత్మనిర్భరత సాధించేందుకు నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్ (NCMM) ఎంతగానో దోహదపడుతుందన్నారు. క్రిటికల్ మినరల్స్ ను దేశీయంగా ఉత్పత్తి చేయడం, వివిధ దేశాలతో ఒప్పందాలు చేసుకుని అక్కడ లభించే కీలకమైన ఖనిజాలను భారతదేశానికి తీసుకురావడం, సుస్థిరమైన మైనింగ్ కార్యకలాపాలను ప్రోత్సహించడం ఈ మిషన్ ప్రధాన లక్ష్యమని అన్నారు.

## మహిళ ఇంట్లో చోరీ

- ఆరేళ్ల తర్వాత పట్టించిన వేలిముద్రలు
- చిన్న మిస్టేక్‌తో దొరికిపోయాడు

**మహా :** ఎంత పెద్ద నేరస్థుడైనా క్రైం స్పాట్‌లో ఏదో ఒక క్లూ వదిలేస్తాడు. ఆ చిన్న క్లూనే అతడిని పట్టిస్తుంది. చట్టం కళ్లుగప్పి ఎన్నేళ్లు తప్పించుకున్నా చివరకు కటకటాలు లెక్కించాల్సిందే. హైదరాబాద్ నగరంలో చోరీ చేసిన ఓ దొంగ విషయంలో అదే నిజమైంది. ఆరేళ్ల క్రితం భారీ చోరీకి పాల్పడి దర్జాగా తిరుగుతున్న దొంగ మరో కేసులో పోలీసులకు చిక్కాడు. వేలి ముద్రల ఆధారంగా ఆరేళ్ల క్రితం జరిగిన చోరీ కేసు కూడా వెలుగులోకి వచ్చింది. దీంతో అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. 2019లో హైదరాబాద్ జూబ్లీహిల్స్ రోడ్ నం.18లోని ఓ ఒంటరి మహిళ ఇంట్లో చోరీ జరిగింది. ఆమె ఇంట్లోకి ప్రవేశించిన ఇద్దరు దొంగలు.. మహిళను బెదిరించి రూ. 50 వేల నగదు, బంగారు, వజ్రాభరణాలు, ఏటీఎం కార్డు, పిన్ నంబరు తీసుకొని అక్కడి నుంచి పారిపోయారు. ఆమె ఫోన్‌ను కూడా తీసుకొని ఆ తర్వాత దాన్ని అక్కడే పెట్టి వెళ్లాడు. అప్పట్లో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఇంట్లో క్లూస్ సేకరించారు. ఫోన్‌పై ఉన్న వేలి ముద్రలు తీసుకున్నారు. అయితే విచారణ చేపట్టినప్పటికీ దొంగ ఆచూకీ మాత్రం దొరకలేదు. పోలీసులు దొంగను పట్టుకోలేకపోయారు. గత ఏడాది డిసెంబరులో నగరంలోని ఓ హాస్టల్‌లో ఫోన్లు చోరీ కేసులో నేపాల్‌కు చెందిన గోవింద్ బండారీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

అతడు లక్డీకపూల్‌లో ఉంటుండగా అదుపులోకి తీసుకొని 51 ఫోన్లను రికవరీ చేశారు. ఆ సమయంలో అతని వేలిముద్రలను సేకరించారు. పాత కేసులు ఏమైనా ఉన్నాయా..? అనే కోణంలో ఫింగర్ ప్రింట్ బ్యూరోకు పంపారు. అనంతరం బెయిలుపై గోవింద్ బండారీ విడుదలయ్యాడు. ఇతని వేలిముద్రలు 2019లో జూబ్లీహిల్స్ దోపిడీకి సంబంధించిన వేలిముద్రలతో మ్యాచ్ కావటంతో అప్పట్లో దొంగతనం చేసింది బండారీనే అని నిర్ధారించారు. దీంతో బండారీ కోసం ఆరా తీయగా అతడు కూకట్‌పల్లిలోని తన సోదరి వద్ద ఉన్నాడన్న సమాచారం మేరకు అక్కడకు చేరుకున్న పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని విచారించారు. విచారణలో ఆ దొంగతనం చేసింది తానే అని ఒప్పుకున్నాడు. డార్జిలింగ్‌కు చెందిన రాజేష్ ఛత్రీ అనే వ్యక్తితో కలిసి చోరీకి పాల్పడినట్లు తెలిపాడు. చోరీ చేసిన తర్వాత నగలను విక్రయించి ఇద్దరూ సమానంగా పంచుకున్నట్లు చెప్పాడు. ఏటీఎం కార్డు ద్వారా రూ. 5వేలు విత్‌డ్రా చేసినట్లు వెల్లడించారు. బండారీ 2019 లో పాస్‌పోర్టు లేకుండా భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించినట్లు పోలీసులు గుర్తించారు. 2020 లో ఆర్సీ పురంలో గ్రామీణ బ్యాంకు చోరీకి మరి కొందరితో కలిసి విఫలయత్నం చేసినట్లు తెలిపాడు. జూబ్లీహిల్స్, బాలానగర్, కూకట్‌పల్లి, ఎస్సార్‌నగర్, జీడిమెట్ల పోలీస్ స్టేషన్లలో ఇతడిపై 14 కు పైగా కేసులున్నాయన్నారు. ప్రస్తుతం రాజేష్ ఛత్రీ పరారీలో ఉండగా అతడి కోసం గాలిస్తున్నట్లు వెల్లడించారు.

సమయం లేదు మిత్రమా..

# పోరాటానికి బీఆర్ఎస్ రెడీ

**పాలిటిక్స్‌లో కేసీఆర్ మళ్లీ యాక్టివ్?**

**ప్రస్తుత పరిస్థితి బీఆర్ఎస్ కు ప్లస్ అవుతుందని భావన**

**స్థానికంలో సత్తా చాటేందుకు కలిసి వస్తుందంటున్న పార్టీ**



**మహా :** సమయం లేదు మిత్రమా. ఇక రణమే అంటోంది ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ. ఇప్పటి వరకు అటు కేటీఆర్, ఇటు హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలపై తమ గళం వినిపిస్తూ వస్తూనే ఉన్నారు. కానీ గులాబీ దళపతి మౌనం అటు బీఆర్ఎస్ క్యాడర్‌లో, తెలంగాణ ప్రజల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది. అయినా పెద్దగా రియాక్ట్ కానీ కేసీఆర్ ఈ మధ్యే కాంగ్రెస్ సర్కార్‌కు ఇండైరెక్ట్ వార్నింగ్ ఇచ్చారు. తాను కొడితే మామూలుగా ఉండదని, ఇక బయలు దేరుడే అని ప్రకటించేశారు. ఈ నెలాఖరులోగా భారీ బహిరంగసభ పెడుదామంటూ అందరూ రావాలని పిలుపు నిచ్చారు. ఈ నేపథ్యంలోనే బీసీ కులగణన అంశాన్ని అస్త్రంగా మల్చుకునే ప్రయత్నం చేస్తోంది బీఆర్ఎస్ పార్టీ. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీ .. చట్టపరంగా కుదరకపోతే .. పార్టీ పరంగా ఇస్తామంటోంది. అయితే కులగణన ప్రక్రియనే సరిగ్గా జరలేదని, రీ సర్వే చేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. బీసీ జనాభాను ఐదున్నరశాతం తగ్గించారని, దాదాపు 22 లక్షల మంది ఉన్నవారిని లేనట్లుగా చూపించారని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఇదే అంశాన్ని హైలెట్ చేయాలని ఫిక్స్ అయింది గులాబీ పార్టీ. అందుకే ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బీసీ నేతలతో వరుసగా భేటీ అవుతూ కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన మాటను తప్పిందని ఎక్స్‌పోజ్ చేసే ప్రయత్నం చేస్తున్నారు. అందులో భాగంగా కామారెడ్డి వేదికగా బీసీ సభ నిర్వహించి సమరం శంఖం పూరించేందుకు గులాబీ దళం సన్నద్ధమవుతోంది.

**కులగణనే ప్రధానాంశం?**

కులగణనతో తమకు ఎంతో మైలేజ్ వస్తుందని హస్తం పార్టీ నేతలు భావిస్తే అంతా తప్పుల తడక అని ప్రతిపక్షాలతో పాటు బీసీ సంఘాలు గళమెత్తుతున్నాయి. దీంతో రాజకీయమంతా బీసీ జనాభా చుట్టే తిరుగుతోంది. కులగణన, బీసీ రిజర్వేషన్ల అంశాలు ప్రతిపక్షాలకు అస్త్రంగా మారాయి. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ బీసీ కులగణను పొలిటికల్ ఎజెండాగా మార్చుకుంటుంది. కులగణన సర్వే రిపోర్ట్ ఓ చిత్తు కాగితంతో సమానమని, ఈ మాట కాంగ్రెస్ ఎమ్మెల్సీనే స్వయంగా చెప్పారని రేవంత్ సర్కార్‌ను కార్నర్ చేస్తున్నారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. ఈ క్రమంలోనే పార్టీ బీసీ నేతలతో సమావేశమై చర్చించారు. కులగణనపై సాకులు చెప్పొద్దని, రీ సర్వే చేయించాలని డిమాండ్ చేశారు. అయితే ఇన్నాళ్లు సైలెంట్‌గా ఉండి, కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను గమనిస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బీసీ కులగణన అంశంతోనే మళ్లీ ప్రజాక్షేత్రంలోకి వచ్చేందుకు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్నికలకు ముందు కామారెడ్డి వేదికగానే బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించింది కాంగ్రెస్ పార్టీ. అదే కామారెడ్డి వేదికగా బీసీ రిజర్వేషన్లు, కులగణన అంశంపై పోరు మొదలు పెట్టేందుకు బీఆర్ఎస్ ప్లాన్ చేస్తోంది. ఈ నెలాఖరులో కామారెడ్డిలో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు కసరత్తు చేస్తోంది కారు పార్టీ

**ప్రభుత్వంపై సమర శంఖం పూరిస్తారా?**

కామారెడ్డి బీసీ ఆందోళన సభకు అధినేత కేసీఆర్ హాజరవ్వనున్నారని, అక్కడి నుంచే ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై సమర శంఖం పూరిస్తారని బీఆర్ఎస్ వర్గాలు అంటున్నాయి. కేసీఆర్ అన్నీ గంభీరంగా గమనిస్తున్నానని, తాను కొడితే మాములుగా ఉండదని చెప్పిన కేసీఆర్ కామారెడ్డి నుంచి సింహగర్జన స్టార్ చేస్తారని, ఆ తర్వాత అసలు ఆట మొదలవుతుందని గులాబీ శ్రేణులు పేర్కొంటున్నాయి. ఇప్పుడు సభ పెడితే బీసీ కులగణనపై నిరసన తెలపడంతో పాటుకేసీఆర్ రంగంలోకి దిగితే స్థానిక సంస్థల్లో పార్టీకి లాభం చేకూరుతుందని కేటీఆర్ సహా ముఖ్యనేతలంతా భావిస్తున్నారు. అందుకే సార్ రంగంలోకి దిగబోతున్నారని చెబుతున్నారు గులాబీ పార్టీ లీడర్లు. బీసీ సభతో కేసీఆర్ పొలిటికల్‌గా యాక్టీవ్ అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో బీఆర్ఎస్‌కు చాలా ప్లస్ అవుతుందంటున్నారు పార్టీ నేతలు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, గులాబీ దళపతి పొలిటికల్ పిచ్‌లోకి దిగడానికి ఇదే సరైన సమయమని భావిస్తున్నారు.

# ఎంపీ ఈటల రాజేందర్‌పై విచారణ జరుపుతాం

- దేవాదాయ భూములపై త్వరలో విచారణ
- బీసీ రిజర్వేషన్ల సర్వే తోతో మంచిపేరు వచ్చిందని కుట్రలు
- మంత్రి కొండా సురేఖ



**హైదరాబాద్, మహా :** గత బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో దేవాదాయ శాఖ భూములు కబ్జా అయ్యాయని, ఆ పార్టీ నాయకులే ఎక్కువగా చేసినట్లు సమాచారం ఉందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేశారు. దేవాలయ భూములపై త్వరలో ఈటెల రాజేందర్ పై విచారణ జరుగుతుందని తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో నిర్వహించిన చిట్ చాట్ లో పేర్కొంటూ సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే పై కేటీఆర్ వ్యాఖ్యలపై మంత్రి మండిపడ్డారు. రీ సర్వే చేయాలంటే ముందుగా ఆయన కుటుంబం దరఖాస్తు చేసుకోవాలని, రీ సర్వే అంటున్న కేటీఆర్ తన చెల్లి కవితను చూసి నేర్చుకోవాలని హితువు పలికారు. సర్వే, ప్రొఫార్మా లో ఎక్కడ తప్పులు జరిగాయో చెప్పాలని, ఎమ్మెల్యేలలో అసంతృప్తి అనేది నాకు తెలీదని తాను ఎవరిని ప్రోత్సహించడం లేదన్నారు. దేవాదాయ శాఖలో ఉద్యోగుల కొరత ఉందని, దీంతో పరిపాలన పరమైన ఇబ్బంది అవుతుందని, రెవెన్యూ నుంచి ఉద్యోగులను తీసుకోవడం ఇప్పుడు కొత్తేమి కాదని స్పష్టం చేశారు. న్యాయ పరమైన చిక్కులు లేని వాటిని మొదటి దశలో సర్వే చేయాలని ఆదేశించినట్లు చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడెక్కడ కుంబాభిషేకాలు చేయాలో జాబితా సిద్ధం చేయాలని ఆదేశాలు ఇచ్చామని, కాళేశ్వరంలో కుంభాభిషేకం చేయక 42 ఏళ్లు అవుతుందన్నారు. ఫారెస్ట్ లో సర్వేయర్ల ప్రొటెక్షన్ పై ఎలాంటి ఫిర్యాదులు లేవన్నారు. బీసీ రిజర్వేషన్ల సర్వే తో మాకు మంచి పేరు వస్తోందనే కుట్రతో బీఆర్ఎస్ నేతలు ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. బిసి రిజర్వేషన్ల విలువ ఇప్పుడే అర్థం కాదని, ఉద్యోగాలు, ఇతర అంశాల్లో బీసీలకు న్యాయం జరుగుతుందని వెల్లడించారు.





# అనాథ విద్యార్థులకు ఏఎస్ఎఫ్, బీబీక్యూ రెస్టారెంట్ లో ఆతిథ్యం

**-చిన్నారులతో కలిసి డిన్నర్ చేసిన మంత్రి సీతక్క**

**మహా :** సంపాదించిన సంపాదనలో కొంత సమాజ శ్రేయస్సుకోసం వినియోగించాలని రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. చిన్నప్పుడే పిల్లల్లో సేవ భావం పెంపొందించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిలో ఉందన్నారు. చిన్ననాటి ఉంటే పిల్లల్లో పెద్దలపట్ల సమాజం పట్ల ఎలా నడుచుకోవాలి నేర్పించాలని హితవు పలికారు. హైదరాబాదు జూబ్లీహిల్స్ లోని ఏఎస్ఎఫ్, బీబీక్యూ & గ్రిల్ రెస్టారెంట్ లో ఏర్పాటుచేసిన విందు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులతో కలిసి ఆమె కాసేపు సరదాగా గడిపారు. వారి యోగక్షేమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విందు కార్యక్రమంలో చిన్నారులతో పాటు మంత్రి పాలుపంచుకొని వారిలో ఆనందాన్ని నింపారు. సామాజిక బాధ్యతగా చిన్నారులకు మంచి రుచికరమైన నాణ్యమైన ఆహారం అందించాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు సంస్థ నిర్వాహకులు కాడ అఖిల్ & ఆరిఫ్ అలీ అన్నారు. చిన్నారుల్లో ఆనందం నింపడమే వన్ ఈవెనింగ్ ఆఫ్ టుగెదర్ అండ్ జాయ్ కార్యక్రమం పేర్కొన్నారు. ఎన్జీవో చెందిన 70 మంది చిన్నారులకు ఆహార అందించడం ఆనందంగా ఉందన్నారు

EDITORIAL సంపాదకీయం

# సామాజిక న్యాయం రేవంత్ బ్రాండ్ !

'స్కిల్ యూనివర్సిటీ','సామాజిక న్యాయం' ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక బ్రాండ్ ఇమేజ్ తీసుకువచ్చే అవకాశాలున్నట్టు పరిశీలకులు భావిస్తున్నారు.మొదట్లో హైడ్రా,మూసీ సుందరీకరణ,ఇతర అనేక విషయాలు తెరపైకి వచ్చినా 'కుల గణన'తో ప్రతిపక్షాలను ఆత్మరక్షణలో పడేయడం వలన 'సామాజిక న్యాయం' నినాదం ఆయన బ్రాండ్ అవుతుందని పరిశీలకులు అంటున్నారు.ఎందుకంటే ఇదేమి ఆషామాషీ వ్యవహారం కాదు.ఒక తేనె తుట్టెను కదిపి సంచలనం సృష్టించారు.రెడ్డి సామాజికవర్గ ముఖ్యమంత్రి ఇలాంటి ఎత్తుగడ వేస్తారని సహజంగా ఎవరూ ఊహించరు.కేంద్రమంత్రి బండి సంజయ్ ఆరోపిస్తున్నట్టు 'అర్బన్ నక్సల్స్' సలహాలు ఏవైనా రేవంత్ తీసుకుంటున్నారేమో మనకు తెలియదు.అయితే సామాజిక న్యాయం అన్నది ముమ్మాటికీ 'క్షిపణి'.ఇక 'స్కిల్ యూనివర్సిటీ' ఏర్పాటు సృజనాత్మక ఆలోచన. ఇది కార్యరూపం దాల్చితే,తప్పనిసరిగా దేశానికి రోల్ మోడల్ అయ్యే చాన్సు ఉన్నది.

> “ సామాజిక న్యాయం అన్నది ముమ్మాటికీ 'క్షిపణి'.ఇక 'స్కిల్ యూనివర్సిటీ' ఏర్పాటు సృజనాత్మక ఆలోచన.ఇది కార్యరూపం దాల్చితే,తప్పనిసరిగా దేశానికి రోల్ మోడల్ అయ్యే చాన్సు ఉన్నది.

''ఎవరైనా గొప్ప వ్యక్తి అడుగుజాడల్లో నడవవద్దు. అతన్ని అధిగమించాలంటే మీరు రెండింతలు కష్టపడాలి.పైగా ఎంత చెమటోడ్చినా చివరకు అనుకరణ అంటారు.గొప్ప పేరు సాధించడానికి కొత్త పుంతలు తొక్కాలి.అది అరుదైన నైపుణ్యం.మీరు ప్రత్యేక గుర్తింపు పొందాలంటే కొత్త దారుల్లో నడవండి.అదివరకు ఆ దారుల్లో ఎవరూ ప్రయాణించి ఉండకపోవచ్చు. అనువుగా లేకపోయినా కొత్త మార్గాలు అన్వేషించి వాటిలో ప్రయాణించడమే మేలు''.అని 1601 1658 కాలానికి చెందిన తత్వవేత్త బాలస్టర్ గ్రేషియన్ అన్నాడు.

సరిగా ఆయన చెప్పినట్టుగానే సాహసోపేతమైన,సంక్లిష్ట దారుల్లో ప్రయాణించడానికి సిద్ధపడినట్టుగా రేవంత్ రెడ్డి కార్యకలాపాలు కనిపిస్తున్నవి.హైడ్రా,మూసీ ప్రాజెక్టులు,స్కిల్ యూనివర్సిటీ,ఉద్యోగాల భర్తీ వంటి నిర్ణయాలన్నీ తక్షణ ఫలితాలు ఇవ్వకపోవచ్చు.హైడ్రా వంటి అంశాల్లో వ్యతిరేకతను కూడా ఎదుర్కొంటున్నారు.అయినా ముఖ్యమంత్రి అడ్డంకులను లెక్కచేయకుండా ముందుకు వెడుతున్నట్టు ఆయన వైఖరి కనిపిస్తున్నది.

తెలుగు రాష్ట్రాలలో ఎన్టీఆర్,చంద్రబాబు,వై.ఎస్,కేసీఆర్ తర్వాత ఆ స్థాయి బ్రాండ్ ఇమేజ్ కోసం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ప్రజా నాయకుడిగా ఎన్టీఆర్,పాలనదక్షునిగా చంద్రబాబు,మాస్ లీడర్ గా డాక్టర్ వైఎస్,తెలంగాణ నిర్మాతగా కేసీఆర్ గుర్తింపు పొందారు.ఎవరి ఇమేజ్ వారు సొంతం చేసుకున్నారు.ఎవరి పాలనా శైలి వారిదే.ఆ నలుగురిలో అందరూ బలశాలులే. గత రాజకీయాలు ,సమకాలీన రాజకీయాలను వడబోస్తే తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల్లో కొద్ది మంది పేరే ప్రజల్లో ఇప్పటికే నానుతోంది.ఇందుకు కారణం ఆయా ముఖ్యమంత్రులు తమ స్టయిల్ లో పరిపాలన సాగించడం,పలు వినూత్న కార్యక్రమాలతో సమాజాన్ని ప్రభావితం చేసి ,ప్రజల మన్ననలు పొందడం వలన బ్రాండ్ ఇమేజ్ ను సంపాదించుకోగలిగారు.

'హైడ్రా'పై తెలంగాణలో,ముఖ్యంగా హైదరాబాద్ లో చర్చ జరగని రోజు లేదు.హైడ్రా కమిషనర్ గా ఐపీఎస్ అధికారి రంగనాథ్ బాధ్యతలు చెపట్టిన తర్వాత చెరువులు,కుంటలు పూడ్చేసి భూములు ఆక్రమించిన వాళ్ల వెన్నులో వణుకు పుడుతోంది.కేసీఆర్ హయాంలో లక్షలాది ఎకరాల భూములను నాటి అధికారపార్టీ నాయకుల అండదండలతో స్వాహా చేసిన ఆరోపణలు వెల్లువెత్తుతున్నవి.ఈ ఏజెన్సీ ఇంతగా బలోపేతం అవడానికి,దూకుడుగా పని చేయడం వెనుక రాజకీయ కారణాలున్నట్టు జరిగే ప్రచారాన్ని తోసిపుచ్చలేం.కేసీఆర్ హయాంలో 'ధరణి' పేరిట జరిగిన లూటీ అంతులేనిది.'' చెరువుల భూముల కబ్జాదారులను వదిలేది లేదు. మా కుటుంబ సభ్యులైనా,సొంత పార్టీ వారైనా,వీఐపీలయినా ఎఫ్.టీ.ఎల్,లేదా బఫర్ జోన్ లో కట్టడాలు నిర్మిస్తే కూల్చక తప్పదు'' అని హైడ్రా ఏర్పాటు ప్రకటన వేళ సీ.ఎం. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.''భగవద్గీత స్ఫూర్తితో నేను ఈ కార్యక్రమానికి పూనుకున్నా.బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యే దానం నాగేందర్ అనుచరుడి కట్టడం,కేంద్ర మాజీమంత్రి పల్లం రాజు బంధువుల కట్టడాలను హైడ్రా కూల్చి వేయడం సంచలన ఘటనలు.ఎం.ఐ.ఎం ఎమ్మెల్యేలు మహ్మద్ ముబీన్, ఎం.ఐ.ఎం ఎమ్మెల్సీ మహ్మద్ మీర్జాకు సంబంధించిన నిర్మాణాలను ఆక్రమణలపేరుతో హైడ్రా కూల్చి వేసింది.



> “ "రాజకీయ నాయకులు ఏం చేసినా అందులో రాజకీయాలే ఉంటాయి".అని సీఎం రేవంత్ రెడ్డి ఒక సందర్భంలో వ్యాఖ్యానించారు. హైదరాబాద్ లో చెరువుల పరిరక్షణ,పర్యావరణం వంటి అంశాలు ఉన్నప్పటికీ రాజకీయ ప్రయోజనాలు లేకుండా ఎవరూ ఏ పని చేయరన్నది ప్రజలకు తెలిసిన విషయం.అయితే ఈ 'ప్రయోగం' ఎంతవరకు సఫలమవుతుందో చూడవలసి ఉన్నది.

మరో వైపు పొంగులేటి,కేవీపీ,మధుయాష్కీ,పట్నం మహేందర్ రెడ్డి తదితరుల ఫాంహౌస్ లు బఫర్ జోన్ లో ఉన్నాయని వాటిని కూల్చాలని బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సీఎం. రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డికి అధికారులు నోటీసులు పంపారు.దుర్గం చెరువు ఎఫ్.టీ.ఎల్ జోన్ లో తిరుపతిరెడ్డికి చెందిన కట్టడాలు ఉన్నాయని,30 రోజుల్లో వాటిని కూల్చివేయాలని నోటీసులో పేర్కొన్నారు.కానీ తిరుపతిరెడ్డికి హైకోర్టు ద్వారా ఊరట లభించింది. కాంగ్రెస్,బీఆర్ఎస్,బీజేపీ,ఎం.ఐ.ఎం. తదితర పార్టీలకు హైడ్రా సెగ తగలింది.''రాజకీయ నాయకులు ఏం చేసినా అందులో రాజకీయాలే ఉంటాయి''.అని సీఎం రేవంత్ రెడ్డి ఒక సందర్భంలో వ్యాఖ్యానించారు.హైదరాబాద్ లో చెరువుల పరిరక్షణ, పర్యావరణం వంటి అంశాలు ఉన్నప్పటికీ రాజకీయ ప్రయోజనాలు లేకుండా ఎవరూ ఏ పని చేయరన్నది ప్రజలకు తెలిసిన విషయం.అయితే ఈ 'ప్రయోగం' ఎంతవరకు సఫలమవుతుందో చూడవలసి ఉన్నది.

> “ ప్రజల్లో కేసీఆర్ హయాంలో అమలైన సంక్షేమ కార్యక్రమాలు బలంగా పాతుకుపోయాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి,అప్పులు,ప్రతి నెలా 6,500 కోట్ల వడ్డీ కింద చెల్లించవలసి రావడం.... ఇవేవీ జనానికి అవసరం లేని విషయాలు.తమకు ఇదివరకు అందించిన పథకాలు తమకు రావలసిందేనన్నది జనం టాక్.

ప్రజాభిమానం విషయంలో ఎన్టీఆర్ తో పోటీపడే వాళ్ళు,ఆయనకు సమఉజ్జీ అనుకునే వాళ్ళు కానీ తెలుగు రాష్ట్రాలలో ఎవరూ కనిపించరు.సినిమా హీరోగా సొంపాదించుకున్న పాపులారిటీ కాకుండా 'పేదల పక్షపాతి సీఎం'గా ఆయన పేరు మరవరానిది.''తొణకిన అన్నం గిన్నె'' శీర్షికతో ఎన్టీఆర్ మరణించిప్పుడు 'వార్త' దినపత్రికలో ప్రచురించిన వార్త నాకిప్పటికీ గుర్తున్నది.అంటే ఆయన చనిపోవడం వలన పేదలకు అందుతున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రశ్నార్థకం కావచ్చునన్న సందేశం ఆ శీర్షికలో ఉన్నది. కిలో రెండు రూపాయల బియ్యం,మహిళలకు ఆస్థి హక్కు ,జనతా వస్త్రాలు,పటేల్ పట్వారీ వ్యవస్థల రద్దు వంటి పథకాలతో సంక్షేమానికి ఎన్టీఆర్ ఒక చిరునామాగా మారడం మామూలు సంగతి కాదు.“అన్న' గా స్థిరపడిన ఎన్టీఆర్ పేరు మరొకరికి రాలేదు.జగనన్న,రేవంతన్న అనే పేర్లు ఇటీవలి కాలంలో వినిపిస్తున్నవి.

ఇక ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పని రాక్షసుడు,పరిపాలన దక్షుడుగా గుర్తింపు పొందారు. సైబరాబాద్ నిర్మాణం వెనుక ఆయన కృషి పేరు తెచ్చిపెట్టింది.పాలన వ్యవహారాల్లో పలు సంస్కరణలు తీసుకువచ్చిన వ్యక్తి గా చంద్రబాబు 'బ్రాండ్ ఇమేజ్' సంపాదించుకున్నారు.ఆయన 74 ఏండ్ల వయసులోనూ ఎంతో ఉత్సాహంగా,ఉత్తేజంగా సమావేశాల్లో పాల్గొంటున్నప్పుడు తమకు ఈర్ష్య కలిగినట్టు దావోస్ పర్యటన ముగిసిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ ఐటి మంత్రి శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు.

> “ సాహసోపేతమైన,సంక్లిష్ట దారుల్లో ప్రయాణించడానికి సిద్ధపడినట్టుగా రేవంత్ రెడ్డి కార్యకలాపాలు కనిపిస్తున్నవి.హైడ్రా,మూసీ ప్రాజెక్టులు,స్కిల్ యూనివర్సిటీ,ఉద్యోగాల భర్తీ వంటి నిర్ణయాలన్నీ తక్షణ ఫలితాలు ఇవ్వకపోవచ్చు.హైడ్రా వంటి అంశాల్లో వ్యతిరేకతను కూడా ఎదుర్కొంటున్నారు. అయినా ముఖ్యమంత్రి అడ్డంకులను లెక్కచేయకుండా ముందుకు వెడుతున్నట్టు ఆయన వైఖరి కనిపిస్తున్నది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 'ప్రజా ప్రస్తానం' పేరుతో 1470 కిలోమీటర్లు పాదయాత్ర చేసి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఒక రికార్డు సృష్టించారు. ఆయన కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చారు.అనంతరం ప్రజల ముఖ్యమంత్రిగా వైఎస్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు.పేదలకు 'ఆరోగ్య శ్రీ' ద్వారా కార్పోరేట్ వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చి గొప్ప పేరు తెచ్చుకున్నారు.ఉచిత విద్యుత్ ఇచ్చి రైతులకు ఆపద్భాంధవుడయ్యారు.విద్యార్థులకు ఫీజు రీఎంబర్స్మెంట్ పథకాలతో అన్ని వర్గాల నేతగా వైఎస్ గుర్తింపు తెచ్చుకున్నారు.కాగా తెలుగు రాష్ట్రాల విభజన తర్వాత తెలంగాణ అంటే కేసీఆర్.,కేసీఆర్ అంటే తెలంగాణ అనే ఇమేజ్ ను కేసీఆర్ సంపాదించుకున్నారు.అంతేకాకుండా 'రైతు బంధు',రైతు బీమా పథకాలు ప్రవేశపెట్టి తనకంటూ ఓ బ్రాండ్ ఇమేజ్ సృష్టించుకున్నారు.

దూకుడు రాజకీయాలు,స్పష్టంగా,సరళంగా,సూటిగా మాట్లాడే వాక్పటిమ రేవంత్ సొంతం.పార్టీ అధ్యక్షుడిగా పాస్ మార్కులు సాధించిన రేవంత్ రెడ్డి,ఇదివరకే బ్రాండ్ ఇమేజ్ సంపాదించుకున్న సీఎంల సరసన చేరాలంటే పాలనలో తనకంటూ ఓ 'ప్రత్యేక సరళి'ని ఏర్పాటు చేసుకోవాల్సిందేనని అనుకుంటున్నారు.హైదరాబాద్ నగరంలో చెరువు భూముల్లో అక్రమంగా నిర్మించుకున్న కట్టడాల్లో దాదాపు 95 శాతం రాజకీయ నాయకులు,వారి బినామీలు,పెట్టుబడిదారులు,రియల్ ఎస్టేట్ వ్యారా దిగ్గజాలే.సీఎంకు నిష్పాక్షికత కలిగిన డైనమిక్ సీఎంగా ఇమేజ్ సాధించుకునే లక్ష్యంలో భాగమేనన్న చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది.భవిష్యత్తులో ముఖ్యమంత్రుల్లో తనకంటూ ఓ పేజీ ఉండాలని రేవంత్ కోరుకుంటున్నట్టు కనిపిస్తోంది.

> “ దూకుడు రాజకీయాలు, స్పష్టంగా, సరళంగా, సూటిగా మాట్లాడే వాక్పటిమ రేవంత్ సొంతం. పార్టీ అధ్యక్షుడిగా పాస్ మార్కులు సాధించిన రేవంత్ రెడ్డి, ఇది వరకే బ్రాండ్ ఇమేజ్ సంపాదించుకున్న సీఎంల సరసన చేరాలంటే పాలనలో తనకంటూ ఓ 'ప్రత్యేక సరళి'ని ఏర్పాటు చేసుకోవాల్సిందేనని అనుకుంటున్నారు.

''ఎన్నికల వరకే రాజకీయాలు ఆ తర్వాత రాష్ట్ర అభివృద్ధే ముఖ్యం'' అని పలు కార్యక్రమాల్లో సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. అందుకే ప్రధాని మోదీ,హోంమంత్రి అమిత్‌షాను కలిసి రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.గ్రూప్ 1 పోస్టుల భర్తీని అడ్డుకోవడానికి కొందరు వేసిన ఎత్తులను రేవంత్ భగ్నం చేశారు.36 నెలల్లో మూసీ నదిని అభివృద్ధి చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నవి.



- ఎస్.కే.జకీర్, సీనియర్ జర్నలిస్ట్

> “ గత రాజకీయాలు,సమకాలీన రాజకీయాలను వడబోస్తే తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల్లో కొద్ది మంది పేరే ప్రజల్లో ఇప్పటికే నానుతోంది.ఇందుకు కారణం ఆయా ముఖ్యమంత్రులు తమ స్టయిల్ లో పరిపాలన సాగించడం,పలు వినూత్న కార్యక్రమాలతో సమాజాన్ని ప్రభావితం చేసి,ప్రజల మన్ననలు పొందడం వలన బ్రాండ్ ఇమేజ్ ను సంపాదించుకోగలిగారు.

కాళేశ్వరం,మిషన్‌భగీరథ, మిషన్ కాకతీయ తప్ప ప్రజలకు మరేమీ గుర్తుకు రాకూడదనే ఉద్దేశంతో కేసీఆర్ వ్యవహరించారని, ప్రతిష్ఠ పెంచుకోవడానికి చేసిన ఆ మూడు పథకాలే కేసీఆర్‌ను దెబ్బతీశాయన్నది సీఎం రేవంత్ విశ్లేషణ.''ఫోన్ ట్యాపింగ్ వల్ల ప్రయోజనం ఉంటుందని నేను అనుకోవడం లేదు.అన్ని ఫోన్లు ట్యాప్ చేసి చివరకు కేసీఆర్ ఏం చేయగలిగారు.అలాంటి తప్పుడు పనులు చివరకు వాళ్లనే మింగేస్తాయి'' అని ఆయన ఒక ఇంటర్వ్యూలో చెప్పారు.


''బీఆర్ఎస్ పార్టీకి చరిత్ర ఉంది గానీ భవిష్యత్తు లేదు'' అని సీఎం రేవంత్ రెడ్డి ఒక సందర్భంలో వ్యాఖ్యానించారు.అయితే అందరూ ఊహించినట్టుగా బిఆర్ఎస్ పార్టీ ఓటమి షాక్ నుంచి త్వరగానే తేరుకున్నట్టు కనిపిస్తోంది.పార్టీ అధినేత కేసీఆర్ కు బ్రాండ్ ఇమేజ్ తీసుకువచ్చిన రైతుబంధు పథకాన్ని రేవంత్ ప్రభుత్వం అమలు చేయకపోవడాన్ని తనకు అనుకూలంగా మలచుకుంటున్నారు. 'రైతుభరోసా' పేరిట ఎకరం, రెండెకరాల భూమి కలిగిన రైతులకు డబ్బు పంపిణీ ఆలస్యంగా మొదలైంది.ప్రజల్లో కేసీఆర్ హయాంలో అమలైన సంక్షేమ కార్యక్రమాలు బలంగా పాతుకుపోయాయి.రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి,అప్పులు,ప్రతి నెలా 6,500కోట్ల వడ్డీ కింద చెల్లించవలసి రావడం.... ఇవేవీ జనానికి అవసరం లేని విషయాలు.తమకు ఇదివరకు అందించిన పథకాలు తమకు రావలసిందేనన్నది జనం టాక్. రేవంత్ అయినా,కేసీఆర్ అయినా ఎవరు ముఖ్యమంత్రిగా ఉన్నా,వాళ్ళు రాష్ట్రాన్ని తాకట్టు పెట్టి అయినా సరే,ఆయా పథకాలు తమకు అందవల్సిందేనని వాళ్ళు అంటున్నారు.రైతులకు రేవంత్ ప్రభుత్వంలో తీరని అన్యాయం జరుగుతోందని కేసీఆర్ పార్టీ నాయకులు సోషల్ మీడియా ద్వారా ఊరూ వాడా ప్రచారం చేస్తున్నారు.మరోవైపు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కదన కుతూహలంతో ఉన్నారు.ఏదో ఒక నెపంతో ఆయన సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్ కు వెళ్లి వస్తున్నారు.అక్కడ దీక్షలు,ధర్నాలు ,ఇతర ఆందోళనా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. రేవంత్ రెడ్డిపై తొడగొట్టి సవాళ్లు విసురుతున్నారు.బిఆర్ఎస్ కార్యకలాపాలను కాంగ్రెస్ పార్టీ నియంత్రించలేకపోతున్నది.అలాగే ప్రభుత్వం వైపు నుంచి ప్రధాన ప్రతిపక్షానికి గట్టి కౌంటర్ కూడా ఇవ్వలేకపోతున్నారు.

## రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
7436939999

# క్యాన్సర్ నివారణే తరుణోపాయం!?

“డైక్లోఫినాక్ “అనే నొప్పి మందు పసువులకు వాడడం మూలంగా చనిపోయిన పసువుల కళేబరం తినే రాబందులు అనబడే పక్షి జాతి అంతం అయ్యింది?పశువులు ప్రస్తుతం గ్రామాల్లో కూడా అంతరించిపోతున్నందున , పశువుల మేత గడ్డి , మరియు కలుపుమొక్క నివారణ కోసం “గ్లైపోసిస్ “అనే కలుపు మందు రైతులు విచ్చలవిడిగా వాడుతున్నారు.పరోక్షంగా పొలంలో వేసిన పంట, భూమి పై ప్రబావం చూపే ఈమందు అమ్మకం పై ప్రస్తుతం నిషేధం విదించినా ఏదో ఒక రూపంలో రైతుకు అందుబాటులో ఉంది.సరళీకరణ, ప్రపంచీకరణ,గ్లోభళీకరణ తర్వాత బహుళజాతి సంస్థలు తయారు చేసిన హైబ్రీడ్ రకాల విత్తనాల పైనే రైతులు ప్రదానంగా ఆధారపడ్డారు.విత్తనశుద్ధికోసం,పంటల్లో తెగుళ్ళు,పురుగుల నివారణ కోసం వాడే విషపూరిత పురుగు మందులు, భూసారం కోసం వేసే కల్తీ రసాయనిక ఎరువులు ఆహార ధాన్యాలలో ఆ అవశేషాలను మనిషి శరీరంలోనికి అసాధారణంగాఇంగ్రీడియన్స్ రూపంలో మోసుకు వస్తున్నాయి?అ త్యాశతో పంటల్లోనూ, సహజ సిద్దంకంటే అదిక దిగుబడిఇచ్చే పంటలు, పండ్ల చెట్ల పెంపకం లోనూ అసాధారణ దిగుబడిలాంటి విధానాలు ,మానవుని అత్యాశ కొంత ఈవ్యాధి విస్తరణ కు కారణం అవుతుంది.ముఖ్యంగా వీదుల్లో విచ్చలవిడిగా లభ్యం అవుతున్న పాణీపూరి,పాస్టుపుడ్స్,రెడీ మేడ్ పుడ్,బ్యాకరీపుడ్స్,జంక్ పుడ్స్ ,నిల్వా ఉండే కూల్ డ్రింక్స్ ఆదునిక జీవనశైలిలో బాగం అయ్యాయి!?.’బిర్యాణీ’కి అలవాటుపడిన తాజా యువత,ప్రజలు అసాధారణ కాలంలో ఉత్పత్తి అయ్యే మాంసం,ముఖ్యంగా విచ్చలవిడిగా అందుబాటులోకి వచ్చే బ్రాయిలర్ కోడి మాంసం సైతం ఇబ్బంది కరంగామారింది.ఇంజెక్షన్లు ఇవ్వడం ద్వారా అసాధారణ రీతిలో తక్కువ కాలవ్యవధి లో ఈ మాంసం ఉత్పత్తి జరుగుతుంది, ఇప్పుడు ఇదే ప్రమాదకర స్థాయికి చేరింది.ఇక అనూహ్య రీతిలోఅదిక లాభాపేక్షతో సమాజంలో కల్తీ మహమ్మారి విస్తరించి ఆహార పదార్థాలను విషతుల్యం చేసి వ్యాపారం పేరుతో ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నారు.దినసరి వాడబడే పాలనుండి ,కూరగాయలు, సరుకులు, తిండిగింజలు, తినుబండారాలు అన్నీ కల్తీ మయం!కాదేది కల్తీకి అనర్హం!!,ఈ ‘అసాధారణం’ అనబడే ఉత్పత్తి పదం “క్యాన్సర్ “అనబడే ఓమహమ్మారి జబ్బుకు కారణం అవుతుంది, అనే స్పృహ మాత్రం చాలా మంది సాదారణ ప్రజలకు లేదు?మానవ శరీరంలో సహజసిద్ధంగా ఉత్పత్తి అయ్యే కణాలుపుడుతూ,గిడుతూ ఉంటాయి.కణవిభజన ఎప్పటికప్పుడు గుణించ బడుతుంది, ఇది సాదారణ జీవన క్రియ! అయితే ,కణవిభజన సమయంలో అసాధారణ మైన రీతిలో,డియన్ఏ విచ్చిన్నం అయి ఓతప్పుడు కణం పుట్టి,అది విభజనతో అసాధారణ రీతిలో పెరిగితే అది క్యాన్సర్ కణం గాశరీరంలోపెరుగుతుంది.అది ఏదోఒక అవయవంలో “కంతి “రూపంలో ఏర్పడి క్యాన్సర్ మహమ్మారి గా బహిర్గతం అవుతుంది.అంటే అసాధారణ రీతి వ్యవసాయం, ఫలసాయం,మందుల వాడకం,అత్యాశ, ఆహార అలవాట్లు మనశరీరంలో అసాధారణ కణజాల ఉత్పత్తి కి కారణం అవుతున్నాయి. ఫళితం క్యాన్సర్ జబ్బు రూపంలోప్రజలను భౌతికంగా, ఆర్థికంగా ,నైతికంగా కుంగదీస్తూంది. చివరకుప్రాణాలనే తినేస్తుంది.ఈక్యాన్సర్ జబ్బు దాని పుట్టుక,విస్తరణ ను బట్టి ఐదు రకాలు 1)కార్షికోమా 2)సార్కోమా 3)మోలకోమా 4)లింపోమా 5) లుకేమియా.ఈ ఐదు రకాలుగా మానవశరీరం లోనివివిధ అవయవాల్లో,బా



గాలలో‘క్యాన్సర్ ‘గా పిలువబడే ఈజబ్బునే తెలుగు బాషలో”కర్క”రోగం అని పిలువబడుతుంది.ఈ క్యాన్సర్ లేదా కర్క రోగం గురించి అధ్యయనం చేసే శాస్త్రం నే “అంకాలజీ”అంటారు.ఈక్యాన్సర్ మహమ్మారి మానవజాతి హననానికి ఎంత వేగంగా అబివృద్ధి అవుతుంది అంటే ప్రపంచంలోని 172దేశాల్లో91దేశాల్లో ఈ క్యాన్సర్ మరణాలదే ప్రధమ, ద్వితీయ స్థానం!ప్రతిఏటా ఈ క్యాన్సర్ జబ్బు కొరకు ప్రపంచంలో 41,17,000వేల కోట్ల ఆర్థిక నష్టం జరుగుతుంది.ప్రతిఏటా ప్రపంచంలో 8మిలియన్ క్యాన్సర్ మరణాలు ఉంటే మన దేశంలో ఆసంఖ్య 7లక్షలు గా ఉంది.ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ననుసరించి ప్రపంచ వ్యాప్తంగా 14మిలియన్ క్యాన్సర్ రోగులు ఉంటే భారతదేశంలో ఆసంఖ్య 1.3 మిలియన్లు గా ఉంది.ప్రతిఎటా మనదేశంలో 11.5లక్షల మంది ప్రజలు కొత్తగా క్యాన్సర్ బారిన పడుతున్నారు.ఈఏడాది 2025 నాటికి క్యాన్సర్ రోగులు సంఖ్య మనదేశంలో 1.3మిలియన్ల నుండి 1.9 మిలియన్ల కు చేరుకుంటుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాగా ఉంది.రాబోవు20 సంవత్సరాల కాలంలో ఈ సంఖ్య రెట్టింపు అవుతుందన్న అంచనాలు ఉన్నాయి.మన దేశంలో ఈ క్యాన్సర్ మరణాలు రికార్డు చేసే యంత్రంగం సైతం కొన్ని రాష్ట్రాల్లో లేదు.పిబిసిఆర్(పాపులేషన్ బేస్డ్ సెన్సెస్ రిజిస్ట్రీ) పేరుతో సంభందిత ఆస్పత్రులు,లేబరేటరీలు, మరణ దృవీకరణ పత్రాలు ద్వారానమోదైన రోగులను మాత్రమే ఈ పద్ధతిలో క్యాన్సర్ జబ్బును గణిస్తారు.గణాంకాలకు అందని ఎన్నో క్యాన్సర్ మరణాలు మనదేశ గ్రామీణ ప్రాంతాల్లో వివిధ జబ్బుల రూపంలో సంభవిస్తున్నాయి.విచ్చలవిడిగా మద్యం సేవించడం,గుట్కా లాంటి నిషేదిత పొగాకు ఉత్పత్తులనుయధేచ్ఛగావాడడం, మత్తు పదార్థాలు,మాదక ద్రవ్యాలు బానిసలు గా మారిన యువత తక్కువ వయస్సులోనే క్యాన్సర్ బారిన పడిమరణిస్తున్నారు.కనుక క్యాన్సర్ జబ్బు బారిన పడి ఆర్థికంగా, భౌతికంగా మన కుటుంబాలు మానవవనరులను నష్టపోయో కంటే,ముందస్తు నివారణ చర్యలు తీసుకోవడం మంచిది.ప్రదానంగా అసాధారణ కణవిభజన ద్వారా విస్తరించే క్యాన్సర్ జబ్బు రావడానికి నిపుణులు ప్రధానంగా ఏడు కారణాలు గుర్తించారు.1) ఆదునిక జీవన విధానం లో వ్యాయామం,శరీరక శ్రమ బొత్తిగా లేకపోవడం 2) అధికబరువు, ఊబకాయం కలిగిఉండడం 3) రక్తంలో చక్కెర స్థాయిలు అధికంగా ఉండడం 4) ఉప్పు అధికంగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవడం 5)పండ్లు,పాలు తగినంత మోతాదులో తీసుకొనక పోవడం 6) పొగాకు ఉత్పత్తులు,మధ్యం వాడకం 7) వారసత్వంగా వచ్చే క్యాన్సర్ వ్యాది.వారసత్వంగా వచ్చే క్యాన్సర్ వ్యాధిని మినహాయిస్తే!మిగతా ఆరు రకాల కారణాలు మనం నివారించుకో కలిగినవే! ఆదునిక కాలంలో ఎన్నోరకాల జబ్బుల బారిన పడుతున్న ప్రజలు ఈ క్యాన్సర్ రోగంను ప్రాథమికంగా గుర్తించడం ఎలా?అనే



ఎన్.తిర్మల్, సీనియర్ జర్నలిస్టు
సెల్:9441864514,

సమస్య వచ్చినప్పుడు క్యాన్సర్ ను ఇలా గుర్తించవచ్చును.చర్మంపై గడ్డలు రావడం,అవి పెరుగుతూ ఉండడం, చాలా కాలంగా నయం కాని పుండు లేదా గాయం ఉండడం,శరీరంలోని పుట్టుమచ్చల పరిణామం పెరగడం తో పాటు, చుట్టూ ఎర్రని వలయం ఏర్పడడం, మూడు వారాలు పైగా కంటిన్యూ గా జలుబు,దగ్గు తదితర సంకేతాలు ఉన్నా ప్రజలు వైద్యులను సంప్రదించి తగు పరీక్షలు ద్వారా నిర్థారణ చేసుకొని 04 దశల్లో ఉండే ఈ క్యాన్సర్ జబ్బుకు చికిత్స పొందవచ్చును.ఎలాంటి పూర్తి నివారణ లేని ఈ క్యాన్సర్ మహమ్మారి కి ఇటీవలనే రష్యాలో శాస్త్ర వెత్తలు వ్యాక్సిన్ కనిపెట్టారనే సమాచారం వ్యాప్తి చెందినప్పటికీ ఆసేవలు ఇంకా ప్రజలకు అందుబాటులోకిరాలేదు.ప్రమాదకరంగా విస్తరిస్తున్న ఈ క్యాన్సర్ వ్యాది బారిన పడకుండా ఉండాలంటే ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# మినీ మేడారంలో భక్తుల భద్రతకు ప్రత్యేక చర్యలు




**జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్**

**ములుగు, మహా :** ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క సారలమ్మ మినీ జాతర ఈనెల 12 నుంచి 15వరకు జరుగుతుండగా భారీ బందోబస్తు చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ పి.శబరీష్ తెలిపారు. వెయ్యి మంది పోలీసు అధికారులు, సిబ్బందితో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పర్యవేక్షిస్తామన్నారు. మంగళవారం మేడారంలో నిర్వహించిన సమీక్షలో పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సుమారు 1000 మంది మినీ జాతరలో బందోబస్తు డ్యూటీలు వేవామని, ములుగుతోపాటు ఖమ్మం, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, భూపాలపల్లి జిల్లాల నుంచి పోలీసు సిబ్బంది హాజరవుతున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ కంట్రోల్ లో భాగంగా సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం డైవర్షన్ పాయింట్లు, పార్కింగ్ సౌకర్యాలను ఏర్పాటు చేశామని, రోడ్లమీద పార్కింగ్ చేయకుండా ఎప్పటికప్పుడు సమీక్షించే విధంగా బైక్ పెట్రోలింగ్ పార్టీలను ఏర్పాటు చేశామన్నారు. డ్రోన్, కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ట్రాఫిక్ ను ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తామన్నారు. అనుకోని సందర్భంలో ఏదైనా వెహికల్ సమస్య వలన ఎక్కడైనా ట్రాఫిక్ జామ్



అయితే వెంటనే ట్రాఫిక్ జామ్ క్లియర్ చేయడానికి వీలుగా జెసిబిలను, టోయింగ్ వెహికల్స్ ను సిద్ధంగా ఉంచారు. మేడారంకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా క్యూలైన్లు, గద్దెల వద్ద బందోబస్తు చేసే సిబ్బంది భక్తులతో సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఎటువంటి నేరాలు జరగకుండా మఫ్టీలలో విధులు నిర్వహిస్తారని, ఎటువంటి దొంగతనాలు జరగకుండా నిత్యం పహారకాస్తామన్నారు. జాతర సందర్భంగా వివిఐపీలు దర్శనానికి వచ్చే అవకాశం ఉన్నందున ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ములుగు ఓఎస్డీ మహేష్ గీతే, ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, డీఎస్పీ సదానందం, సీఐలు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



**హైదరాబాద్ లో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జ్ దీపాదాస్ మున్షి ని ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్ రెడ్డి , గండ్ర సత్యనారాయణ రావు, కేఆర్ నాగరాజు యశస్వినీ భేటీ కావడం జరిగింది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపుపై నేతలు చర్చించారు .**

# జిహెచ్ఎంసి కార్మికుల సమస్యలపై ప్రభుత్వంతో చర్చిస్తాం

- కార్మికులకు ఉద్యోగ భద్రత, ప్రమోషన్లు, ఆరోగ్య భద్రత, జిహెచ్ఎంసి చెత్త రవాణా అంశంపైనే ప్రధాన జెండా
- గత పాలకుల్లాగా దర్వాజాలు బంద్ చేసే ప్రభుత్వం కాంగ్రెస్ ది కాదు
- నిరసనలు తెలుపకుండానే జిహెచ్ఎంసి కార్మికుల సమస్యలను పరిష్కరిస్తాం

**ఎల్బీనగర్, మహా:** హైదరాబాద్ మహానగరంలో జిహెచ్ఎంసి కార్మికులు చేస్తున్నటువంటి సేవ కాంగ్రెస్ ప్రభుత్వం పాలకులు కచ్చితంగా గుర్తిస్తారని, కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐ ఎన్ టి యూ సి, అనుబంధ మున్సిపల్ సహకర్ మజ్దూర్ యూనియన్ (ఎం ఎస్ ఎం యూ) , టీజేఏసీ, జిహెచ్ఎంసి కార్మిక యూనియన్ నాయకులతో కలిసి ప్రభుత్వంతో చర్చించి పరిష్కరించుకుంటామని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. మంగళవారం ఎల్బీనగర్ నియోజకవర్గం జిహెచ్ఎంసి ఎల్బీనగర్ సరూర్ నగర్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో ఐఎన్టీయూసీ జిహెచ్ఎంసి కార్మికుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి టీజేఏసీ (తెలంగాణ జన సమితి) సంపూర్ణ మద్దతు తో నిర్వహించిన కార్యక్రమానికి ఐ ఎన్ టి యు సి ఆల్ ఇండియా అధ్యక్షులు డాక్టర్ జి సంజీవరెడ్డి, జనక్ ప్రసాద్, సత్యజిత్ రెడ్డి, ఐఎన్టీయూసీ అనుబంధ మున్సిపల్ సహకర్ మజ్దూర్ యూనియన్ (ఎం ఎస్ ఎం యూ) గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు ఆదిల్ షరీఫ్ తో కలిసి ఎమ్మెల్సీ కోదండరాం హాజరయ్యారు. ఈ సందర్భంగా



జిహెచ్ఎంసి కార్మిక యూనియన్ నాయకులు పలు సమస్యలను కోదండరాం దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ...... గత పాలకుల్లాగా కార్మికుల సమస్యలపై దర్వాజాలు బంద్ పెట్టి నిరంకుశ తత్వంగా వ్యవహరించే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వ పాలకులు ఎప్పటికీ వ్యవహరించారని కోదండరాం పునరుద్ఘాటించారు. గతంలో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ పాలకులను కలిసే పరిస్థితి లేదన్నారు. కానీ ప్రజల సహకారంతో, ప్రజల యొక్క సంపూర్ణ మద్దతు తెలంగాణలో అధికారం చేపట్టినటువంటి కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటికీ కార్మిక పక్షపాతిగానే వ్యవహరిస్తుందన్నారు. గ్రేట్ హైదరాబాద్ లో జిహెచ్ఎంసి కార్మికులు చేస్తున్నటువంటి విధి నిర్వహణ ప్రభుత్వం తప్పక గుర్తిస్తుందన్నారు. విపత్కర కరోనా పరిస్థితుల్లో ప్రజల యొక్క ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రాణాల సైతం ప్రాణంగా పెట్టిన జిహెచ్ఎంసి కార్మికులు తమ విధులకు హాజరై ప్రజారక్షణలో భాగస్వాములు అయ్యారని గుర్తు చేశారు. ప్రధానంగా కార్మికులు ఎదుర్కొంటున్నటువంటి సమస్యల్లో కార్మికులకు ప్రమోషన్లు, ఉద్యోగ భద్రత, ఆరోగ్య భీమా, జిహెచ్ఎంసి చెత్త రవాణా రంగం ప్రైవేటీకరణ వంటి అంశాలపై ఐ ఎన్ టి యు సి, జిహెచ్ఎంసి కార్మిక, ఉద్యోగ సంఘాల నాయకులు, టీజేఏసీ ఆధ్వర్యంలో కార్మికుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతామన్నారు. గత పాలకులు సమస్యలు పరిష్కారం కోసం వస్తే కార్మికులను భయభ్రాంతులను గురిచేసి అలసి వేసే ధోరణిగా వ్యవహరించారన్న సంగతి తెలంగాణ ప్రజలు ఎప్పటికీ మరువరన్నారు. అలాంటి సందర్భంలోనే తాము కూడా కార్మిక ఉద్యోగ సంఘాలతో కలిసి నిరసన చేపట్టడం జరిగిందన్నారు. జిహెచ్ఎంసి కార్మికుల సమస్యలకు ముమ్ముందు ఇలాంటి పరిస్థితులు రాకూడదని ఉద్దేశంతోనే ప్రభుత్వంతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కే శివకుమార్, ఎం శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.



**జమాతే ఏ ఉల్మా హింద్ సమావేశానికి హాజరైన కంది శ్రీనివాస రెడ్డి**

**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ పట్టణం బొక్కలగూడలోని జమాతే ఏ ఉల్మా హింద్ సంస్థ కార్యాలయంలో జరిగిన సమావేశానికి కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్చార్జి కంది శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సంస్థ బాధ్యులు అబ్దుల్ ఘని, అబు బకర్, హఫీజ్ మన్సూర్, హఫీజ్ అహ్మద్ కంది శ్రీనివాసరెడ్డిని సాదరంగా స్వాగతించి శాలువాతో సత్కరించారు. అనంతరం సంస్థ బాధ్యులను కంది శ్రీనివాసరెడ్డి సత్కరించారు. కార్యక్రమ నిర్వాహకులు మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ జహీర్ రంజాని, కాంగ్రెస్ నాయకులు మహ్మద్ ముజాహిదుద్దీన్, ఖిజర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## జాబ్ లేదని మనస్తాపానికి గురై యువకుడి ఆత్మహత్య

**వరంగల్, మహా:** వరంగల్ ఏనుమాముల పోలీస్ స్టేషన్ పరిధిలో ఎన్టీఆర్ నగర్ కు చెందిన చల్ల నవీన్, 24 సంవత్సరాల వ్యక్తి గత రెండు నెలలుగా జాబ్ మానేసి ఇంటిలో ఉంటున్నాడు. నిన్నటి రోజు సాయంత్రం ఇంటిలో ఎవరూ లేని సమయంలో జాబ్ లేదని మనస్తాపానికి గురై ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి చల్ల రవి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎనుమాముల ఇన్స్పెక్టర్ ఏ. రాఘవేందర్ ఓ ప్రకటనలో తెలిపారు.



## పదోన్నతితో బాధ్యతలు పెరుగుతాయి

**వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**

**వరంగల్, మహా:** పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తున్న పోలీసుల పదోన్నతులతో వారి బాధ్యతలు కూడా పెరుగుతాయని వరంగల్ సిపి పోలీస్ అధికారులకు సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ పోలీస్ స్టేషన్లలో ఏ.ఎస్.ఐగా విధులు నిర్వహిస్తూ ఎస్.ఐలు పదోన్నతి పొందిన సంపత్, యాదగిరి, విజయ్ కుమార్ లు మంగళవారం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పాగుచ్ఛాలను అందజేశారు. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన పోలీస్ అధికారులతో మాట్లాడుతూ వీలైంత వరకు ప్రజలకు న్యాయం అందించేందుకు కృషి చేయాలని, పోలీస్ శాఖ కీర్తి ప్రతిష్టలు బంగం కలిగించే రీతిలో వ్యహరించవద్దని పోలీస్ కమిషనర్ తెలిపారు.

# ఏపీలో బర్డ్‌ఫ్లూ కలకలం

**పౌల్ట్రీ వాహనాలను నో ఎంట్రీ**

- సరిహద్దుల్లో చెక్ పోస్టులను ఏర్పాటు చేసిన తెలంగాణ సర్కార్
- ఆందోళనలో చికెన్ ప్రియులు

**మహా :** ఏపీలోని పలు జిల్లాల్లో బర్డ్ ఫ్లూ వైరస్ వెలుగు చూడటం కలకలం రేపుతోంది. అక్కడ చికెన్ అమ్మకాలు నిలిపివేయాలని జిల్లా కలెక్టర్లు ఆదేశించారు. బర్డ్ ఫ్లూ తేలిన ఫారాల్లోని కోళ్లు, గుడ్లను పూడ్చి పెట్టాలన్నారు. దీంతో మిగతా ప్రాంతాలవారు చికెన్ తినడంపై ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ నుంచి తెంగాణకు వచ్చే పౌల్ట్రీ వాహనాలను నిలిపివేయాలని జిల్లా సరిహద్దుల్లోని చెక్ పోస్టు అధికారులను ఆదేశించింది. రాష్ట్ర సరిహద్దుల్లో తనిఖీలు ముమ్మరం చేసింది. ఏపీ నుంచి వచ్చే పౌల్ట్రీ వాహనాలకు ప్రవేశాన్ని నిరాకరిస్తోంది. మంగళవారం ఉదయం జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ టోల్ ప్లాజా వద్ద జిల్లా పశు వైద్య శాఖ ప్రత్యేక బృందాలను మోహరించింది. కర్నూలు తదితర ప్రాంతాల నుంచి కోళ్లతో వచ్చే వాహనాలను తనిఖీలు చేసి వెనక్కి పంపారు. సోమవారం సాయంత్రం కూడా ఇలాంటి ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టారు. రాష్ట్రంలో వైరస్ వ్యాప్తిని అరికట్టడమే లక్ష్యంగా ఈ చర్య తీసుకుంటున్నట్లు అధికారులు వెల్లడించారు. అలాగే ఆంధ్రప్రదేశ్ నుంచి పక్షులు, పక్షి దాణా తీసుకువెళ్లే వాహనాలకు సైతం అనుమతి




ఇవ్వరాదని పశుసంవర్ధక, పోలీసు శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది.ముఖ్యంగా సరిహద్దు గ్రామాల్లోని పౌల్ట్రీ రైతులకు వైరస్ వ్యాప్తి చెందకుండా పరిశుభ్రత చర్యలు తీసుకునేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తెలంగాణకు వచ్చే అన్ని జిల్లాల సరిహద్దుల్లో అప్రమత్తంగా ఉండాలని పొరుగు రాష్ట్రాల నుంచి ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ నుండి రాష్ట్రంలోకి వచ్చే పౌల్ట్రీ వాహనాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించకుండా చూడాలన్నారు. జిల్లా కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పౌల్ట్రీ రైతులకు అవగాహన కల్పించాలన్నారు. చికెన్ షాపు నిర్వాహకులకు, ప్రజలకు కూడా బర్డ్ ఫ్లూ గురించి అవగాహన కల్పించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాలతో మాంసం ప్రియులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని రోజులు చికెన్ తినటం పూర్తిగా మానేయాలని భావిస్తున్నారు. అయితే వైరస్ సోకని కోడి మాంసాన్ని 100 డిగ్రీల ఉష్ణోగ్రతలో ఉడికించి తినొచ్చని, సరిగా ఉడకబెట్టకపోతే సమస్యలు వస్తాయని డాక్టర్లు చెబుతున్నారు.

## ఈవీఎం డేటాను డిలీట్ చేయొద్దు

**ఈసీకి సుప్రీం కోర్టు ఆదేశాలు**

**మహా:** ఈవీఎంలపై ఈసీకి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల ప్రక్రియ పూర్తయిన తర్వాత ఈవీఎంలలోని డేటాను తొలగించకుండా చూడాలని పిటిషన్ దాఖలు కాగా ఆ పిటిషన్‌ను అత్యున్నత ధర్మాసనం నేడు విచారించింది. ఈ క్రమంలో ఈవీఎంలలోని డేటాను డిలీట్ చేయవద్దని ఆదేశించింది. అలాగే ఎన్నికల తర్వాత ఈవీఎంల నుంచి డేటాను తొలగించడానికి ఎలాంటి ప్రక్రియను అనుసరిస్తారో 15 రోజుల్లోగా నివేదికను అందజేయాలని ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది.

# తెలంగాణ పీజీ మెడికల్ సీట్లలో ఏపీ విద్యార్థులు

**స్థానికత కోటాపై సుప్రీంకోర్టుకు రేవంత్ సర్కార్**

విచారణ ఏప్రిల్ 4 కు వాయిదా

హైకోర్టు తీర్పుతో 200 సీట్లు కోల్పోతున్న తెలంగాణ విద్యార్థులు

**మహా :** ఆంధ్రప్రదేశ్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేసిన మెడికల్ విద్యార్థులు స్థానికత కోటా కింద తెలంగాణలోని మెడికల్ కాలేజీల్లో ప్రవేశం పొందేలా తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై తాజాగా రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. కేవలం తెలంగాణలో ఎంబీబీఎస్ చేసిన మెడికల్ విద్యార్థులకు మాత్రమే పీజీ మెడికల్ కాలేజీల్లో స్థానికత కోటా కింద ప్రవేశాలు కల్పించాలని రేవంత్ రెడ్డి సర్కార్ చేసిన విజ్ఞప్తికి తెలంగాణ హైకోర్టు అంగీకరించలేదు. ఈ నేపథ్యంలోనే జస్టిస్ సుధాంశు దిలియా నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల ధర్మాసనం తేల్చి చెప్పింది. ఈ తీర్పును సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వం ప్రస్తావించగా తాము విచారణ చేపడతామని ధర్మాసనం తెలిపింది. పీజీ మెడికల్ సీట్లలో స్థానికత కోటాపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును రేవంత్ రెడ్డి ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేయగా జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం కోర్టు విచారణకు అంగీకరించింది. తెలంగాణ పిటిషన్‌పై పూర్తిస్థాయి విచారణకు అనుమతించిన సుప్రీంకోర్టు విస్తృత ధర్మాసనానికి బదిలీ చేయడానికి ముందు తాము విచారణ చేపడతామని జస్టిస్ బీఆర్ గవాయ్ స్పష్టం చేస్తూ తదుపరి విచారణను సుప్రీం కోర్టు ఏప్రిల్ 4 వ తేదీకి వాయిదా వేసింది. ఆర్టికల్ 371 డీ ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో ఎంబీబీఎస్ చేసిన విద్యార్థులకు పీజీలో స్థానికత కోటాలో తెలంగాణలోని మెడికల్ కాలేజీలో సీట్లు కేటాయించాలని సుమారు 100 మంది విద్యార్థులు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన తెలంగాణ హైకోర్టు ఆర్టికల్ 371డీ ప్రకారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో పీజీ మెడికల్ సీట్లలో స్థానిక కోటా వర్తిస్తుందని తీర్పును వెలువరించింది. అయితే రాష్ట్ర విభజన జరిగిన తర్వాత ఆర్టికల్ 371డీ ని 10 ఏళ్ల పాటు మాత్రమే వర్తింపజేయాలని ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం 2014లో ఉన్న నిబంధనను తెలంగాణ ప్రభుత్వం గుర్తు చేసినా ఆ వాదనను హైకోర్టు పరిగణనలోకి తీసుకోలేదు.

9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు తెలంగాణలో చదివిన విద్యార్థులకు మాత్రమే స్థానిక కోటా వర్తిస్తుందని తెలంగాణ ప్రభుత్వం హైకోర్టులో వాదించింది. తెలంగాణలో చదివిన వారికి మాత్రమే ఈ స్థానికత కోటా వర్తిస్తుందని తేల్చి చెప్పింది. అయితే ఆర్టికల్ 371 డీ ప్రకారం రాయలసీమ, ఆంధ్ర ప్రాంతాల్లో ఎంబీబీఎస్ చదివిన వారు కూడా తెలంగాణలో పీజీ మెడికల్ సీట్లలో స్థానిక కోటా కింద అర్హులేనంటూ తెలంగాణ హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఆర్టికల్ 371 డీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు వర్తిస్తున్నందు వల్ల దానిలో సవరణలు చేసేంత వరకూ ఆంధ్రా, రాయలసీమల్లో ఎంబీబీఎస్ చదివిన విద్యార్థులు కూడా తెలంగాణలో స్థానిక కోటా కింద పీజీ మెడికల్ సీట్లు పొందేందుకు అర్హులేనని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుతో తెలంగాణలో పీజీ మెడికల్ సీట్లలో సుమారు 200 మంది ఏపీ విద్యార్థులు ప్రవేశాలు పొందేందుకు అర్హత సాధించారు. ఈ నేపథ్యంలోనే ఈ పీజీ మెడికల్ సీట్లలో ఏపీ విద్యార్థులకు స్థానికత కల్పిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది.

# డొనాల్డ్ ట్రంప్ మరో సంచలన నిర్ణయం

**అదానీ గ్రూప్‌కు బిగ్ రిలీఫ్**

**మహా:** అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సంచలన నిర్ణయాలతో ప్రపంచ దేశాలను ఆశ్చర్యంలో ముంచెత్తుతున్న డొనాల్డ్ ట్రంప్ తాజాగా మరో కీలక ఆదేశాలు జారీ చేశారు. అమెరికాలోని ఫారిన్ కరప్ట్ ప్రాక్టీసెస్ యాక్ట్‌ఎఫ్‌సీపీఏను నిలిపివేయాలని అమెరికా న్యాయ శాఖను ఆదేశించారు. 50 ఏళ్ల క్రితం తీసుకువచ్చిన ఈ చట్టాన్ని నిలిపివేసేందుకు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై ట్రంప్ సంతకం చేశారు. అయితే ఈ నిర్ణయం అదానీ గ్రూప్‌కు బిగ్ రిలీఫ్ కల్పించినట్లయింది. ఎందుకంటే భారత్‌లో సోలార్ పవర్ ప్రాజెక్టుకు సంబంధించిన కాంట్రాక్టుల వ్యవహారంలో లంచాలు ఇచ్చారన్న ఆరోపణలతో అమెరికాలో అదానీ గ్రూప్‌పై కేసు నమోదు కాగా.. ప్రస్తుతం విచారణ జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే ఈ చట్టాన్ని నిలిపివేయడం ద్వారా అదానీ గ్రూప్‌పై విచారణ తాత్కాలికంగా వాయిదా పడనుంది. ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయంతో ఇవాళ స్టాక్ మార్కెట్లు భారీ నష్టాల్లో ఉన్నా అదానీ గ్రూప్ షేర్లు కాస్త లాభపడ్డాయి. భారత్‌లో భారీ సోలార్ ఎనర్జీ ప్రాజెక్టును దక్కించుకునేందుకు.. అదానీ గ్రూప్ లంచాలు ఇచ్చేందుకు ప్రయత్నాలు చేసినట్లు కొన్ని నెలల క్రితం సంచలన ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. అయితే ఈ నిధుల్లో అమెరికా ఇన్వెస్టర్ల నిధులు కూడా ఉండడంతో ఈ ఫారిన్ కరప్ట్ ప్రాక్టీసెస్ యాక్ట్‌ఎఫ్‌సీపీఏ చట్టం కింద అప్పుడు అమెరికా అధ్యక్షుడిగా ఉన్న జో బైడెన్ నేతృత్వంలోని డెమోక్రటిక్ పార్టీ ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. దీంతో అదానీ గ్రూప్‌లో తీవ్ర కలవరం నెలకొంది. మరోవైపు.. మదుపర్లలో తీవ్ర భయాందోళనలు నెలకొనడంతో అదానీ గ్రూప్ షేర్లు భారీగా పతనం అయ్యాయి.



# మెట్రో విస్తరణకు వ్యతిరేకంగా హైకోర్టులో పిల్

**పిల్ దాఖలు చేసిన ఏపీడబ్ల్యూఎఫ్**

విచారణ 17 కు వాయిదా వేసిన న్యాయస్థానం


**మహా :** హైదరాబాద్ మెట్రో విస్తరణకు వ్యతిరేకంగా హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. ఏపీడబ్ల్యూఎఫ్ ఈ పిటిషన్ ను దాఖలు చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, హైదరాబాద్ మెట్రో ఎండీ, వక్ఫ్ బోర్డు సీఈవోలను ప్రతివాదులుగా చేర్చారు. పాతబస్తీలో మెట్రో నిర్మాణంపై పిటిషనర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. చారిత్రక కట్టడాలను పరిగణనలోకి తీసుకోకుండా నిర్మాణం చేపడుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణ వారసత్వ చట్టం 2017 ప్రకారం చారిత్రక కట్టడాలను రక్షించాలని పిటిషన్ లో పేర్కొన్నారు. పాతబస్తీ ప్రతిపాదిత మెట్రోమార్గం సమీపంలో చార్మినార్, ఫలక్‌నుమా ప్యాలెస్, పురానీహవేలి, మొఘల్ పురా సమాధులు వంటి చారిత్రక కట్టడాలు ఉన్నాయని పిటిషన్ లో పొందుపరిచారు. మెట్రో రైలు నిర్మాణం కారణంగా ఈ స్మారక చిహ్నాలకు నష్టం జరిగే ప్రమాదం ఉందని పిటిషన్ లో పొందుపరిచారు. మెట్రో విస్తరణ కోసం తదుపరి పనులు చేపట్టే ముందు హైకోర్టు లేదా నిపుణుల బృందం ఆమోదం పొందాలని కోరారు. అప్పటి వరకు పనులను నిలిపివేయాలని ఏపీడబ్ల్యూఎఫ్ హైకోర్టును విజ్ఞప్తి చేసింది. పిటిషన్ పై విచారణను ఫిబ్రవరి 17న హైకోర్టు వాయిదా వేసింది.

# నో పాలిటిక్స్.. ఓన్లీ సినిమా

**జీవితాంతం రాజకీయాలకు దూరం**

**నా లక్ష్యాలు నెరవేర్చేందుకు నా సోదరుడు పవన్ కల్యాణ్ ఉన్నాడు**

**సినీ వేడుకలో చిరంజీవి సంచలన వ్యాఖ్యలు**



**హైదరాబాద్, మహా:** తాను రాజకీయాల వైపు మళ్లీ వెళ్తానేమోనని పలువురు అనుకుంటున్నారని, జీవితాంతం కళామతల్లి సేవలోనే ఉంటానని చిరంజీవి స్పష్టం చేశారు. సినీరంగానికి సేవల కోసమే రాజకీయ పెద్దలను కలుస్తాన్నానని, అంతకుమించి ఏమీ లేదన్నారు. రాజకీయంగా తాను అనుకున్న లక్ష్యాలు, సేవలు నెరవేర్చేందుకు తన సోదరుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఉన్నారని చెప్పారు. హైదరాబాద్‌లో జరిగిన 'బ్రహ్మ ఆనందం' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో చిరంజీవి ఈ వ్యాఖ్యలు చేశారు. ''జీవితాంతం రాజకీయాలకు దూరంగా ఉంటూ సినిమాలకు అతి దగ్గరగా ఉంటా. 'పెద్ద పెద్ద వారిని కలుస్తున్నాడు. ఏంటీ? అటువైపు ఏమైనా వెళ్తాడా?' అని కొందరు సందేహపడుతున్నారు. అలాంటి డౌట్స్ పెట్టుకోవద్దు'' అని అన్నారు.



## నిక్షయ్ శివిర్ కార్యక్రమము విజయవంతం

**హుజూర్ నగర్, మహా:** జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమములో భాగంగా మంగళవారం మఠంపల్లి మండలంలోని పెదవీడు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 100 రోజుల నిక్షయ్ శివిర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సుధాకర్ నాయక్ మాట్లాడుతూ 2030 నాటికి క్షయ వ్యాధిని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.అందులో భాగంగా ప్రతి అనుమానిత వ్యక్తికి ముందస్తుగా తెమడ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఇంతకు ముందు చికిత్స చేపించుకున్న వారి కుటుంబీకులు, షుగర్ వ్యాది గ్రస్తులు, వ్యాది నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు, పొగ త్రాగడం అలవాటు ఉన్నవారు, కార్పెంటర్ పని చేయుచున్నవారు మొదలగు వారు విధిగా ముందస్తు పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. 88 మందికి తెమడ పరీక్షలు, ఎక్స్ రే పరీక్షలు మరియు క్షయ వ్యాధి నిర్ధారణ ఇంజెక్షన్ పరీక్షలు చేసారని తెలియజేశారు. ఈ కార్యక్రమములో జిల్లా మరియు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది ఆరోగ్య విస్తరణ




అధికారి ప్రభాకర్ సూపర్వైజర్ రవి, నాగేంద్రమ్మ హుజూర్నగర్ టీబి యూనిట్ సూపర్వైజర్ మమత ఎం ఎల్ హెచ్ పి ఆదిలక్ష్మి లాబ్ టెక్నీషియన్ రమేష్ ఏఎన్ఎం సీతమ్మ ఆరోగ్య సహాయకులు శ్రీనివాస్ భాస్కర్ జిల్లా టీవీ యూనిట్ కోఆర్డినేటర్ ప్రసాద్ డిఈఓ మాధవరెడ్డి మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలి

### రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారుల శిక్షణ తరగతుల్లో ..జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.

**ములుగు, మహా :** ఎంపిటిసి, జెడ్పీటీసీ సభ్యుల ఎన్నికల నిర్వహణ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని విధాలుగా సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులకు మొదటి దశ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 87 ఎంపిటిసి, 10 జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ కోసం ముందస్తుగానే అన్ని ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలని సూచించారు. నియమ, నిబంధనలపై పూర్తి అవగాహనను ఏర్పర్చుకోవాలని, ఎలాంటి వివాదాలు, తప్పిదాలకు తావులేకుండా నిబంధలను తు.చ తప్పకుండా పాటిస్తూ ఎన్నికల విధులను జాగ్రత్తగా నిర్వర్తించాలని హితవు పలికారు. ఎంపిటిసి, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల కమిషన్ ప్రకటనను అనుసరిస్తూ ఆర్.ఓలు నోటిఫికేషన్ జారీ చేసి, ఆ రోజు నుండే ఎంపిటిసి, జెడ్పీటీసీ స్థానాల ఎన్నిక కోసం నామినేషన్లు స్వీకరించాల్సి ఉంటుందని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు మండల పరిషత్ కార్యాలయం లో ఏర్పాటు చేసుకుని, నోటిఫికేషన్




లో స్పష్టంగా వివరాలను పొందుపర్చాలని అన్నారు. నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, ఉపసంహరణ ప్రక్రియలను మార్గదర్శకాలకు అనుగుణంగా పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. సమయ పాలనను పక్కాగా పాటిస్తూ, నామినేషన్ల స్వీకరణ కేంద్రం గదిలో తప్పనిసరిగా గోడ గడియారం అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చే అభ్యర్థులతో పాటు వారి ప్రతిపాదకులు స్థానికులేనా అన్నది ఓటరు జాబితా ఆధారంగా నిర్ధారణ చేసుకోవాలని అన్నారు. అదేవిధంగా నామినేషన్ల ఉపసంహరణ కోసం అభ్యర్థులు కాకుండా, వారి తరపున ప్రతిపాదకులు వచ్చిన సమయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతనే ఉపసంహరణకు అనుమతించాలని కలెక్టర్ సూచించారు. బ్యాలెట్ పేపర్ లో అభ్యర్థుల పేర్లను అక్షర క్రమం ఆధారంగా వరుసగా ముద్రించాల్సి ఉంటుందని, అభ్యర్థులు ఎన్ని సెట్ల నామినేషన్లు సమర్పిస్తే, అన్ని నామినేషన్ల దరఖాస్తులను తప్పనిసరిగా పరిశీలించాలని, వాటిలో ఎన్ని ఆమోదించబడ్డాయి, ఎన్ని తిరస్కరణకు గురయ్యాయి, అందుకు గల కారణాలు ఏమిటీ అనే అంశాలను వెల్లడించాల్సి ఉంటుందని అన్నారు. నోటిఫికేషన్ జారీ చేసిన నాటి నుండి ప్రతి రోజు త్వరితగతిన డైలీ రిపోర్టును పంపించాలని, సంబంధిత వెబ్ సైట్లో అభ్యర్థుల నామినేషన్ పత్రాలను స్కాన్ చేసి అప్లోడ్ చేయాలని సూచించారు. నామినేషన్ల స్వీకరణ చివరి సమయంలో, విత్ డ్రా సమయాల్లో వీడియో చిత్రీకరణ చేయిస్తే, తగిన ఆధారాలుగా ఉపయోగపడతాయని తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ నిబంధనలకు అనుగుణంగా పక్కాగా జరిగితే, పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలు సజావుగా జరిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని నోటిఫికేషన్ జారీ, నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, ఉపసంహరణ ప్రక్రియలను సమర్ధవంతంగా నిర్వహించాలని ఆర్.ఓలు, సహాయ ఆర్.ఓలకు కలెక్టర్ మార్గనిర్దేశం చేశారు.

## అర్చకులపై దాడులు అమానుషం



**హుజూర్ నగర్ ,మహా:** చిలుకూరు బాలాజీ దేవాలయ ప్రధాన పూజారి రంగరాజన్ పై చేసిన దాడిని ఖండిస్తున్నామని పరాశరం అయ్యప్ప తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన చిలుకూరు దేవాలయం ప్రధాన అర్చకుడైనటువంటి రంగరాజన్ పై కొంతమంది అల్లరి మూకలు సనాతన ధర్మంపై మరియు దేవాలయ అర్చకులపై దాడి చేయడం అమానుషమని వెంటనే నిందితులను కఠినంగా శిక్షించాలని మరొకరిపై దాడి చేయడానికి కూడా వారు భయపడేలా వారికి శిక్ష విధించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. అలాగే చిలుకూరు బాలాజీ దేవాలయ ప్రధాన పూజారిని ఫోన్లో పరామర్శించడం జరిగిందన్నారు. ఇకపై దేవాలయ అర్చకుల పై ఎవరైనా దాడులకు పాల్పడితే తీవ్రస్థాయిలో ఉద్యమిస్తామన్నారు.

## టోల్ గేటు యాజమాన్యం నిర్లక్ష్య వైఖరిపై ఫిర్యాదు

### తీరు మారకుంటే ఉద్యమిస్తాం



**హుజూర్ నగర్, మహా:** నిర్లక్ష్య వైఖరితో వ్యవహరిస్తున్న చిల్లేపల్లి టోల్గేట్ యాజమాన్యంపై అధికారులు తక్షణ చర్యలు వేపట్టాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనంజయ నాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం నేరేడుచర్లకు చెందిన సిపిఐ బృందం హుజూర్నగర్ ఆర్డీవో శ్రీనివాసులకు వినతి పత్రం ఇచ్చిన అనంతరం మాట్లాడారు.పాత నిబంధనల ప్రకారం యాజమాన్యం వ్యవహరించాలని 20 కిలోమీటర్ల పరిధిలో ఉన్న అన్ని గ్రామాలను లోకల్ యూనిట్ గా పరిగణించి వాహనదారులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని, అలాగే టోల్గేట్ లో పనిచేసే సిబ్బందిని స్థానికులకే కేటాయించాలనే నిబంధనలు ఉన్నప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న యాజమాన్యంపై అధికారులు తక్షణ చర్యలు తీసుకొని ప్రజలకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.గత మూడు రోజులుగా సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకోలు ధర్నాలు , వివిధ రూపాల్లో ఉద్యమాలు చేసినప్పటికీ టోల్ గేట్ యాజమాన్యంలో ఎలాంటి చలనం లేదన్నారు. అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని.. ధర్నాలు రాస్తారోకోలే కాకుండా అవసరమైతే నిరాహార దీక్షలకు కూడా సిద్ధంగా ఉన్నామని ఆయన తెలిపారు కార్యక్రమంలో తెలంగాణరాష్ట్ర రైతుసంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్ నేరేడుచర్ల పట్టణ సిపిఐ కార్యదర్శి కత్తి శ్రీనివాసరెడ్డి, ఏఐవైఎఫ్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, ఏఐఎస్ఎఫ్ నాయకుడు కొమ్మరాజు వెంకట్, ఏఐవైఎఫ్ నేరేడుచర్ల పట్టణ అధ్యక్షుడు పరికె భరత్ మరియు జక్కుల రమణ తదితరులు ఉన్నారు.

## పదవ తరగతిలో 100% ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలి

### జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.

**ములుగు, మహా :** పదవ తరగతిలో 100% ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. కలెక్టర్ తన ఛాంబర్ లో మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి జి పాణిని తో కలిసి మండల విద్యాశాఖ అధికారులతో పదవ తరగతి వార్షిక పరీక్షలకు సన్నద్ధత పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ములుగు జిల్లా పదవ తరగతి వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించుట కోసం మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు శక్తివంచన లేకుండా కృషి చేయాలని అన్నారు. మండల విద్యాశాఖ అధికారులు ప్రతిరోజు వారి పరిధిలోని రెండు పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో సంభాషించి చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిని ప్రోత్సహించాలని అన్నారు. ప్రతి పాఠశాల వారీగా చదువులో వెనుకబడిన విద్యార్థుల వివరాలు మండల విద్యాశాఖ అధికారుల దగ్గర ఉండాలని మరియు విద్యార్థుల తల్లిదండ్రులతో సమీక్షా సమావేశం నిర్వహించి విద్యార్థుల స్థాయిని తెలిపి మార్చిలో వార్షిక



రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను ప్రతి ఒక్కరు విధిగా అమలు చేస్తూ ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా విద్యార్థులకి చదువు యొక్క ఆవశ్యకతను తెలుపుతూనే ఒకవేళ ఫెయిల్ అయినంత మాత్రాన విద్యార్థులు ఎలాంటి తొందరపాటు తప్పు నిర్ణయాలు తీసుకోకుండా జీవితం యొక్క గొప్పతనాన్ని విద్యార్థులకు ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు తెలియజేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి జీ పాణిని, జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు కార్యదర్శి ఈ సూర్యనారాయణ, ఏ సి జి ఈ అప్పని జయదేవ్, జిల్లాలోని మండల విద్యాశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక క్వారీల్లో కాంట్రాక్టర్ల అక్రమవసూళ్లు ఆపాలి




- ఓవర్ లోడ్ ప్రోత్సహించే కాంట్రాక్టర్లపై కేసులు
- నమోదు చేయాలి: రాష్ట్ర లారీ యజమానుల జేఏసీ

**ఎల్బీనగర్, మహా:** రాష్ట్రంలో ఇసుక లారీలతో పాటు వాటి యజమానులపై అధికారుల దాడులు ,వేధింపులు ఆపాలని ఇసుక క్వారీల్లో కాంట్రాక్టర్ల అక్రమవసూళ్లు ఆపాలని ఓవర్ లోడ్ లను ప్రోత్సహించే కాంట్రాక్టర్లపై కేసులు నమోదు చేయాలని రాష్ట్ర లారీ యజమానుల జేఏసీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.తమపై జరుగుతున్న వేదింపుల నివారణకు ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలపై ఎల్బీనగర్ లోని ఓ గార్డెన్ లో రాష్ట్ర లారీ యజమానుల జేఏసీ ఆద్వర్యంలో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సంఘ నాయకులు నర్రి వెంకన్న, సుర్వి యాదయ్య గౌడ్ లు మాట్లాడుతూ అధిక లోడ్ పేరుతో ఆర్టీఏ, మైనింగ్, విజిలెన్స్ అధికారులు ఇసుక లారీలకు అడ్డగోలుగా రూ.లక్షల్లో చలానాలు విధిస్తున్నారని, ఆ జరిమానా కట్టలేక ఎంతో మంది లారీ యజమానులు, డ్రైవర్లు రోడ్డున పడుతున్నారని వాపోయారు. జయశంకర్ భూపాలపల్లి, ములుగు, పెద్దపల్లి తదితర జిల్లాలో అధికారుల వేధింపులకు తాళలేక పలువురు లారీ యాజమానులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు.దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని, ఇసుక లారీలపై దాడులు నిలిపివేయించాలని కోరారు.లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.ఈకార్యక్రమంలో సంఘ నాయకులు సుర్వి రాజు గౌడ్ లారీ వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మినీ మేడారం జాతరకు ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి

- జిల్లా అధికారుల సూచనలు భక్తులు పాటించాలి
- జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్



**ములుగు, మహా :** ఈనెల 12 బుధవారం నుండి ప్రారంభం కానున్న మినీ మేడారం జాతరకు అన్ని ప్రత్యేక ఏర్పాట్లను పూర్తి చేయడం జరిగిందని, అమ్మవార్లను దర్శించుకునేందుకు వచ్చే భక్తులు జిల్లా అధికారుల సూచనలు పాటించాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్. మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్.ఎస్.తాడువాయి మండలం మేడారంలో జరుగనున్న మినీ మేడారం జాతరను పురస్కరించుకొని గత పక్షం రోజుల నుండి పారిశుద్ధ పనులను చేపట్టడం జరిగిందని, ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతో భక్తులు జంపన్న వాగులో పుణ్య స్థానాలు ఆచరించడానికి నల్లాలు ఏర్పాటు చేయడం మహిళలు బట్టలు మార్చుకోవడానికి ప్రత్యేక గదులను ఏర్పాటు చేశామని అన్నారు. జాతరలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక పోలీసు సిబ్బందిని నియమించడం జరిగిందని, గద్దెల ప్రాంతంలో క్యూలైన్ల వద్ద భక్తులు ఎలాంటి ఇబ్బందుల గురికాకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని వివరించారు. ఏటూరు నాగారం మండలం కొండాయి, ఐలాపూర్ గ్రామాలలో జరుగనున్న మినీ మేడారం జాతరకు సైతం ఏర్పాట్లు పూర్తి చేయడంతో పాటు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ చిన్న బోయిన పల్లి గ్రామం నుండి కొండాయి వరకు, తాడ్వాయి, ఊరటం గ్రామాల నుండి కొండాయి వరకు భక్తులను తరలించడానికి ప్రత్యేక బస్సుల ను ఏర్పాటు చేశారని తెలిపారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకొని సంతోషంగా తమ గ్రామాలకు చేరుకోవాలని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

## తన జన్మదినాన్ని పురస్కరించుకొని కేటీఆర్ ఆశీర్వాదం తీసుకున్న బన్నాల

**ఉప్పల్,మహా:** బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ తన జన్మదినాన్ని పురస్కరించుకొని బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ ఐటీ శాఖ మాత్యులు కేటీఆర్ ని కలిసి ఆశీర్వాదం తీసుకోవడం జరిగింది.అనంతరం కేటీఆర్ గారు బన్నాల ప్రవీణ్ పుట్టినరోజు సందర్భంగా ఆ భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడూ బన్నాల ప్రవీణ్ పై ఉండాలని మంచి రాజకీయ భవిష్యత్తు ఆ భగవంతుడు ప్రసాదించాలని, పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీకి అంకితభావంతో పనిచేసిన ప్రతి ఒక్క కార్యకర్తకి, నాయకునికి మంచి భవిష్యత్తు ఉండే విధంగా తాను అన్ని చర్యలు చేపడతానని కొని ఆడారు .బన్నాల ప్రవీణ్ కేటీఆర్ కి తిరుపతి వెంకటేశ్వర స్వామి మహా ప్రసాదం లడ్డూని మరియు NGRI అభయాంజనేయ స్వామి చందనం కేటీఆర్ కి



పెడుతూ వారికి అభయాంజనేయ స్వామి ప్రసాదాలు అందజేశారు.కార్యక్రమంలో కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ బన్నాల గీత, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శ్యామ్,సంతోష్ నాయక్, సాయి మొదలగు వారు పాల్గొన్నారు.



## ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు సహకారం

**వరంగల్, మహా:** గ్రేటర్ వరంగల్ నగరంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు పూర్తి సహకారం అందిస్తామని బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే స్పష్టం చేశారు. ఇందిరా మహిళా శక్తి పథకం లో భాగంగా హనుమకొండ సుబేదారి ఫారెస్ట్ ఆఫీసు ప్రాంతంలో మెప్మా వారి సహకారంతో ఏర్పాటు చేసిన లహరి చపాతి మేకింగ్ యూనిట్ ను కమిషనర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి నిర్వహిస్తున్న తీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఓం శ్రీ భద్రకాళి గ్రూపు కు చెందిన సభ్యురాళ్ల విన్నపం మేరకు చపాతి తయారీ యూనిట్ ఏర్పాటు కు మెప్మా నుండి ఆర్థిక సహాయం అందజేసి సహకరించడం జరిగిందని, వినియోగదారుల అవసరాలను దృష్టి లో ఉంచుకొని యూనిట్ విస్తరించుకొదలిస్తే అందుకు కావలసిన ఆర్థిక సహాయాన్ని బల్దియా అందిస్తుందని, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు కు ముందుకు వచ్చే ఔత్సాహిక ఎస్ హెచ్ జీ లను ప్రోత్సహిస్తూ సబ్సిడీలు దక్కేలా లోన్ లను అందజేస్తూ సహకరించనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రాజేశ్వర్, టి ఎం సి రమేష్, కమ్యూనిటీ ఆర్గనైజర్ స్వాతి, తదితరులు, పాల్గొన్నారు.

## ఎయిర్ పోర్ట్ భూ సేకరణకై రైతులు సహకరించాలి

### వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ




**వరంగల్, మహా:** పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తున్న పోలీసుల పదోన్నతులతో వారి బాధ్యతలు కూడా పెరుగుతాయని వరంగల్ సిపి పోలీస్ అధికారులకు సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ పోలీస్ స్టేషన్లలో ఏ. ఎస్. ఐగా విధులు నిర్వహిస్తూ ఎస్. ఐలు పదోన్నతి పొందిన సంపత్, యాదగిరి, విజయ్ కుమార్ లు మంగళవారం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ మార్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పాగుచ్చాలను అందజేశారు. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన పోలీస్ అధికారులతో మాట్లాడుతూ వీలైంత వరకు ప్రజలకు న్యాయం అందించేందుకు కృషి చేయాలని, పోలీస్ శాఖ కీర్తి ప్రతిష్టలు బంగం కలిగించే రీతిలో వ్యహరించవద్దని పోలీస్ కమిషనర్ తెలిపారు.

## పన్ను వసూళ్ల లో పురోగతి అవసరం

### బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే

**వరంగల్, మహా:** పన్ను వసూళ్ల లో పురోగతి అవసరం అని బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే అభిప్రాయపడ్డారు. బల్దియా పరిధి నక్కల గుట్ట సర్కిల్ కార్యాలయంలో గల సి ఎస్ సి సెంటర్ , ఈసేవా కేంద్రాన్ని కమిషనర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి రోజు వారిగా పన్ను వసూళ్ల తీరు ను సిబ్బందిని అడిగి తెలుసుకొని నిర్వహిస్తున్న పన్ను వసూళ్ల నమోదు రిజిస్టర్ ను పరిశీలించారు. ఈ సందర్భం గా కమిషనర్ మాట్లాడుతూ ఆర్థిక సం.ముగింపు దశకు చేరుకునే తరుణం లో పన్ను వసూళ్ల లో.వేగం పెంచి నిర్దిష్ట లక్ష్యాన్ని చేరుకోవాలని, వినియోగదారులకు పన్ను చెల్లింపు సంబంధిత రసీదు అందజేయాలని ఇందుకోసం ప్రింటర్



ఏర్పాటు చేసుకోవడం తో పాటు రిజిస్టర్ లో నమోదు తప్పనిసరి అని, నెల వారి వసూళ్ల సంబంధ రికార్డు నిర్వహించాలని సూచించిన కమిషనర్ ప్రజల అవగాహన కోసం పన్నులు చెల్లించాలని కోరుతూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ లను కమిషనర్ పరిశీలించారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ కమిషనర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## కన్నాయిగూడెం మండలంలో ఇరువురు ఆత్మహత్య

### వివాహేతర సంబంధమే కారణమా..?



**ములుగు, మహా :** వివాహితతో మరో వ్యక్తి వివాహేతర సంబంధం వారి ఆత్మహత్యకు దారితీసిన సంఘటన ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం గ్రామంలో మంగళవారం జరిగింది. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఆలం స్వామి, అశ్విని 15రోజులుగా సహజీవనం చేస్తున్నారు. అశ్వినికి ఇదివరకే మరో వ్యక్తితో పెళ్లి కాగా ఒక కుమారుడు ఉన్నాడు. అయితే మరో వ్యక్తితో చనువుగా ఉంటుండటంతో మొదటి భర్త పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీ పెట్టాడు. తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేసినట్లు తెలిసింది. అయితే తప్పు జరిగింది కాబట్టి మహిళ ప్రియున్ని రూ.2లక్షలు కట్టాలని ఒప్పించినట్లు సమాచారం. మొదటి భర్త ఒప్పుకోకుండా పోలీస్ స్టేషన్ లో కేసు పెట్టినట్లు తెలిసింది. భయపడిన ఇరువురు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. కాగా, ఈ విషయంపై పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి దర్యాప్తు చేస్తున్నారు. వివాహేతర సంబంధమే ఇరువురి ఆత్మహత్యకు కారణమైనట్లు మండలంలో ప్రచారం జరుగుతోంది

## ఫార్మాసిటీ రైతులతో డీసీపీ ముఖాముఖి

- సామరస్యంగా సమస్య పరిష్కరించుకోవాలి
- విభేదాలకు రాగద్వేషాలకు వెళ్లకూడదు
- రైతుల సమస్యలు ఉన్నతాధికారులకు వివరిస్తాం
- సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం డిసిపి

**ఇబ్రహీంపట్నం, మహా:** ఇబ్రహీంపట్నం ఏసీపి కార్యాలయ ఆవరణలో ఫార్మాసిటీ భూ బాధిత రైతులతో మహేశ్వరం జోన్ డీసీపీ సునీత రెడ్డి ముఖాముఖి కార్యక్రమాన్ని ఏసీపీ రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశం ద్వారా రైతులు తమ ఆవేదనను డీసీపీకి వివరించారు. యాచారం మండలం పరిధిలోని, మేడిపల్లి, నానక్ నగర్, తాడిపత్రి, కుర్మిద్ద గ్రామాలలో భూములు కోల్పోయిన రైతులతో ముఖాముఖి సమావేశంలో పాల్గొన్న మహేశ్వరం డీసీపీ సునీతా రెడ్డి రైతులను ఉద్దేశించి




మాట్లాడుతూ... ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన రైతులు నిత్యం ఆందోళనలు చేపడుతున్న నేపథ్యంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రైతుల సమస్యలు తెలుసుకోవడం జరిగిందని, రైతుల భూముల వివరాలు ఆన్ లైన్ లో లేకపోవడం రైతు భరోసా, రైతు బీమా వంటి సమస్యలు ఉన్నాయని రైతులు వివరించడం జరిగిందని అన్నారు. భూముల వివరాలు ఆన్ లైన్ లో లేని వంటి వాటి గురించి, కలెక్టర్ మరియు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి మా వంతు సాయ సహకారాలు అందిస్తామని అన్నారు. రైతులు, పోలీసులు సమన్వయంతో సాగాలి తప్ప, విభేదాలు తలెత్తకుండా, రాగద్వేషాలకు వెళ్లకుండా



ధర్నాలు ఆందోళనలను శాంతియుతంగా చేసుకోవాలని సూచించారు. కొంతమంది రాజకీయ నాయకులు వాళ్ల స్వలాభం కోసం, రైతులను రెచ్చగొట్టే ప్రయత్నం చేయడం జరుగుతుందని, అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని, కఠినమైన శిక్ష విధించడం జరుగుతుందన్నారు. శాంతియుతంగా మీ ఆవేదనను తెలపాలని, దానికి పోలీస్ వ్యవస్థ నుండి సహకారం ఉంటుందని తెలిపారు. మేము కూడా రైతు కుటుంబాల నుంచి వచ్చిన వాళ్ళమే, రైతుల సమస్యల పట్ల సానుకూలంగా వ్యవహరిస్తామని, పోలీసులకు రైతులకు మధ్య ఎలాంటి గొడవలు లేకుండా సామరస్యంగా సమస్యను పరిష్కరించే విధంగా ఉండాలని సూచించారు.

## నేటి నుండి మినీ మేడారం జాతర

**ములుగు, మహా:** తెలంగాణలోని ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో గిరిజనుల అతి పెద్ద పండుగ మినీ మేడారం జాతర బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభం కానుంది. మినీ మేడమ్ జాతరకు ముందే నిద్రలో ముందు నుండే భక్తులు అధిక సంఖ్యలో దర్శనాలు చేసుకుంటున్నారు. పెద్ద జాతర రెండు సంవత్సరాలకొకసారి ఘనంగా నిర్వహిస్తారు. అయితే ఈ జాతరకు ఏటేటా భక్తుల రద్దీ పెరుగుతూ వస్తున్న నేపథ్యంలో ఈసారి ఫిబ్రవరి 12, 13, 14, 15 తేదీల్లో సమ్మక్క సారక్క మినీ మేడారం జాతర నిర్వహించేందుకు ఆదివాసి పూజారులు ముహుర్తం ఖరారు చేశారు. ఈ జాతర నిర్వహణకు వారం రోజుల ముందే ఆదివాసీల ఆచారాల ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం మేడారంతో పాటు అనుబంధ గ్రామాలు, ఆలయాలతో ఊరుకట్టు నిర్వహించి, ఆలయాలను శుద్ధి చేసి సంప్రదాయ బద్ధంగా పూజలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

# గోల్డ్ హై జంప్.. ఆల్‌టైమ్ హైకి తులం ధర

## ఒక్కరోజే రూ.2,430 ఎగిసిన తులం ధర.. ఆల్‌టైమ్ హైని తాకుతూ రూ.88,500కు చేరిక

**న్యూఢిల్లీ :** బంగారం ధరలు భారీగా పెరిగాయి. ఆల్‌టైమ్ హైలో స్థిరపడ్డాయి. సోమవారం ఒక్కరోజే దేశీయ మార్కెట్‌లో దాదాపు రెండున్నర వేలు పుంజుకున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల హెచ్చరికలు.. స్టాక్, ఫారెక్స్ మార్కెట్లతోపాటు బులియన్ మార్కెట్‌నూ షేక్ చేసేశాయి మరి. ఈ క్రమంలోనే ఢిల్లీలో 24 క్యారెట్ 10 గ్రాముల ధర రూ.2,430 ఎగబాకి మునుపెన్నడూ లేనివిధంగా రూ.88,500ను తాకింది. ఈ మేరకు అఖిల భారత సరఫా అసోసియేషన్ తెలియజేసింది.

**ఇదీ సంగతి..**

అగ్రరాజ్యంలోకి దిగుమతయ్యే ఉక్కు, అల్యూమినియంలపై 25 శాతం సుంకాలు వేస్తామని ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఈక్విటీ మార్కెట్లు కుదేలవగా.. బంగారం, వెండి తదితర కమోడిటీ మార్కెట్లు పరుగులు పెట్టాయి. ఈ నేపథ్యంలోనే స్పాట్ మార్కెట్లలో ఔన్స్ గోల్డ్ విలువ రికార్డు స్థాయిలో 2,900 డాలర్లు పలికింది. కోమెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్‌లోనూ రూ.2,932.69 డాలర్లుగా ట్రేడైంది. త్వరలోనే 3,000 డాలర్లు పలికినా ఆశ్చర్యపోనక్కర్లేదన్న అంచనాలు వినిపిస్తున్నాయి. ఇక సిల్వర్ ఔన్స్ 32.76 డాలర్లను చేరింది. ఈ ట్రెండ్ దెబ్బకు భారతీయ మార్కెట్లలోనూ హోల్‌సేల్, రిటైల్ నగల వ్యాపారుల నుంచి పెద్ద ఎత్తున డిమాండ్ కనిపించింది. ఫలితంగా ఒక్కసారిగా రేట్లు పైపైకిపోయాయి. నిజానికి గతకొద్ది రోజులుగా గోల్డ్ మార్కెట్ దూకుడు మీదనే ఉన్నది. స్టాక్ మార్కెట్ల ఒడుదొడుకుల నడుమ ఇన్వెస్టర్లు.. సురక్షిత పెట్టుబడి సాధనమైన పసిడి వైపే అడుగులు వేస్తున్నారు. అయితే ట్రంప్ దుందుడుకు నిర్ణయాలతో వాణిజ్య యుద్ధానికి అవకాశాలుండటంతో పుత్తడి ధరలు రాబోయే రోజుల్లో మరింత పెరిగే వీలే ఉన్నదంటున్నారు మార్కెట్ విశ్లేషకులు. దీంతో మదుపరులు గోల్డ్‌పై ఇంకా ఇన్వెస్ట్‌మెంట్లు పెట్టవచ్చని అంచనా వేస్తున్నారు. అదే జరిగితే సరికొత్త శిఖరాలను ధరలు అధిరోహించడం ఖాయమేనన్న అభిప్రాయాలు గట్టిగా వినిపిస్తున్నాయిప్పుడు.

**హైదరాబాద్‌లో..**

దేశ రాజధానిలో ధరలతో పోల్చితే హైదరాబాద్ మార్కెట్‌లో రేట్లు ఒకింత స్థిరంగానే ఉన్నట్టు కనిపిస్తున్నాయి. తులం 24 క్యారెట్ గోల్డ్ రేటు రూ.87,060గా ఉన్నది. 22 క్యారెట్ పసిడి ధర రూ.79,800గా నమోదైంది. గతంతో పోల్చితే వరుసగా రూ.390, రూ.350 చొప్పున పెరిగాయి. ఇక ఢిల్లీలో కిలో వెండి ధర రూ.97,500గా ఉన్నది. మును పటితో చూస్తే రూ.1,000 పెరిగింది. ఇక ఎంసీఎక్స్‌పై ఫ్యూచర్స్ ట్రేడింగ్‌లో గోల్డ్ కాంట్రాక్ట్స్ ఏప్రిల్‌కుగాను 10 గ్రాములు రూ.940 పెరిగి రూ. 85,828గా నమోదైంది.



# నేనే ఎక్స్‌ను కొంటా అమ్ముతావా..

## ఎలాన్ మస్క్‌కు శామ్ ఆల్ట్‌మన్ రివర్స్ కౌంటర్

టెస్లా గ్రూప్ చీఫ్ ఎలాన్ మస్క్, ఓపెన్ ఏఐ సీఈవో శామ్ ఆల్ట్‌మన్ మధ్య సోషల్ మీడియా వేదికగా వార్ కొనసాగుతోంది. వీళ్ల మధ్య గత కొంతకాలంగా ఓపెన్ ఏఐ సంస్థ పనితీరు విషయంలో వివాదం నడుస్తోంది. గత ఏడాది రెండుసార్లు ఓపెన్ ఏఐ సంస్థపై ఎలాన్ మస్క్ కోర్టుకు కూడా వెళ్లారు. ఈ క్రమంలో తాజాగా ఓపెన్ ఏఐ సంస్థను 97.4 బిలియన్ డాలర్లు పెట్టి కొనుగోలు చేస్తామని ఎలాన్ మస్క్ నేతృత్వంలోని పెట్టుబడిదారుల బృందం ఆఫర్ చేయడం వివాదాన్ని మరింత తీవ్రం చేసింది. ఎలాన్ మస్క్ నేతృత్వంలోని పెట్టుబడిదారుల బృందం తాము 97.4 బిలియన్ డాలర్‌లు (భారత కరెన్సీలో రూ.8.5 లక్షల కోట్లు) పెట్టి ఓపెన్‌ఏఐ సంస్థను కొనుగోలు చేస్తామని శామ్ ఆల్ట్‌మన్‌కు ఆఫర్ చేసింది. అయితే మస్క్ టీమ్ ప్రతిపాదనను శామ్ ఆల్ట్‌మన్ తిరస్కరించారు. అంతేకాదు ఎలాన్ మస్క్‌కు రివర్స్ కౌంటర్ కూడా ఇచ్చారు. 'నేనే 9.74 బిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో రూ.85 వేల కోట్లు) పెట్టి మీ ఎక్స్ (X) సంస్థను కొంటా. అమ్ముతారా..?' అంటూ సోషల్ మీడియాలో రివర్స్ ప్రపోజల్ చేశారు. ఎలాన్ మస్క్ తన ఓపెన్‌ఏఐ సంస్థకు 97.4 బిలియన్ డాలర్లు పెడుతానంటే.. శామ్ ఆల్ట్‌మన్ మస్క్‌కు చెందిన X సంస్థకు కేవలం 9.74 బిలియన్ డాలర్లు పెడుతానని ప్రతిపాదన చేశారు. అంటే తన ఓపెన్‌ఏఐ సంస్థ విలువలో X సంస్థ విలువ కేవలం పదో వంతు మాత్రమేనని ఆల్ట్‌మన్ పరోక్షంగా కౌంటర్ ఇచ్చారు. అయితే ఆల్ట్‌మన్ పోస్టుకు మస్క్ వెంటనే స్పందించారు. ఆల్ట్‌మన్‌ను ఉద్దేశించి 'మోసగాడు' అని పోస్టు చేశారు. గతంలో కూడా శామ్ ఆల్ట్‌మన్ పేరును ఎలాన్ మస్క్ 'స్కామ్ ఆల్ట్‌మన్' అని పోస్టు చేశారు. కాగా 2022 లో ఎలాన్ మస్క్ 44 బిలియన్ డాలర్లు పెట్టి ఎక్స్ సంస్థను కొనుగోలు చేశారు. ఇప్పుడు శామ్ ఆల్ట్‌మన్ దాన్ని కేవలం 9.74 బిలయన్ డాలర్‌లకు కొంటానని రివర్స్ ఆఫర్ చేయడం ద్వారా మస్క్‌కు కౌంటర్ ఇచ్చారు. ఈ ఆసక్తికరమైన సోషల్ మీడియా వార్ ఇప్పుడు వ్యాపార వర్గాలు, ఐటీ పరిశ్రమల్లో టాక్ ఆఫ్ ది టౌన్ అయ్యింది.

**మస్క్, ఆల్ట్‌మన్ మధ్య గొడవేంటి..?**

ఓపెన్ ఏఐ అనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్టార్టప్ సంస్థను స్థాపించినప్పుడు ఆ సంస్థ కో ఫౌండర్స్‌లో ఎలాన్ మస్క్ ఒకరు. ఎలాంటి లాభాపేక్ష, వ్యాపారకాంక్ష లేకుండా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఓపెన్ సోర్స్ చేసి అందరికీ ఉచితంగా ఉపయోగపడేలా చేయాలన్నదే ఓపెన్‌ఏఐ సంస్థ లక్ష్యమని, కానీ ఆ తర్వాత కాలంలో ఓపెన్‌ఏఐ సంస్థ లాభం కోసం మాత్రమే పనిచేసే వ్యాపార సంస్థగా మారిందని ఎలాన్ మస్క్ ఆరోపిస్తున్నారు. ఇదే విషయమై మస్క్ 2024లో రెండుసార్లు కోర్టుకు కూడా వెళ్లారు. ఓపెన్‌ఏఐ సంస్థ లక్ష్యాలను గుర్తుచేస్తూ లాభం కోసం పనిచేయడం పక్కనపెట్టి నలుగురికి ఉపయోగపడేలా సంస్థ పనిచేయాలని అన్నారు. ఓపెన్‌ఏఐ సంస్థ భవిష్యత్ ప్రణాళికలు కూడా మానవాళికి ఆందోళనకరంగా ఉన్నాయని చెప్పారు. ఇప్పుడు ఓపెన్‌ఏఐ సంస్థను కొనుగోలు చేయడానికి ముందుకు రావడానికి కారణం కూడా అదేనని మస్క్ తెలిపారు. అయితే ఎలాన్ మస్క్ ఆరోపణలను ఓపెన్‌ఏఐ సంస్థ ఖండించింది. ఓపెన్‌ఏఐ సంస్థను మస్క్ సొంత సంస్థ అయిన టెస్లాలో విలీనం చేసి భారీగా డబ్బు సంపాదించుకోవాలని భావిస్తున్నారని శామ్ ఆల్ట్‌మన్ ఆరోపిస్తున్నారు.




# ట్రంప్ టారిఫ్ వార్..

## ఎఫ్ఐఐల ఉపసంహరణతో దెబ్బతిన్న ఇన్వెస్టర్ సెంటిమెంట్.. నష్టాలతో ముగిసిన సూచీలు..!

తాజాగా ప్రపంచ దేశాల నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై టారిఫ్‌లు పెంచుతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనతో వాణిజ్య యుద్ధానికి తెర తీశారు. మరోవైపు, దేశీయ వృద్ధిరేటు పురోగతిపై సందేహాల మధ్య విదేశీ ఇన్వెస్టర్లు దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి నిరంతరం నిధుల ఉపసంహరణకు పాల్పడటంతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలహీన పడింది. ఫలితంగా మంగళవారం ఈక్విటీ మార్కెట్‌లు వరుసగా ఐదో రోజు ఒకశాతానికి పైగా నష్టాలతో ముగిశాయి. బీఎస్ఈ30 ఇండెక్స్ సెన్సెక్స్ 1,018.20 పాయింట్లు (1.32శాతం) నష్టపోయి రెండు వారాల కనిష్ట స్థాయి 76,293.60 పాయింట్ల వద్ద స్థిర పడింది. ఇంట్రాడే ట్రేడింగ్‌లో 1281.21 పాయింట్ల (1.65 శాతం) పతనంతో 76,030.59 పాయింట్ల కనిష్టానికి పడిపోయింది. మరోవైపు ఎన్ఎస్ఈ50 సూచీ నిఫ్టీ సైతం 309.80 పాయింట్ల (1.32 శాతం) పతనంతో 23,071.80 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీలోని 50 స్టాక్స్‌లో 44స్టాక్స్ నష్టాలతో స్థిర పడితే, ఆరు స్లాక్స్ లాభ పడ్డాయి. బీఎస్ఈ 30 ఇండెక్స్ సెన్సెక్స్‌లో జొమాటో ఐదు శాతానికి పైగా నష్టపోయింది. టాటా స్టీల్, బజాజ్ ఫిన్ సర్వ్, టాటా మోటార్స్, పవర్ గ్రిడ్, లార్సెన్ అండ్ టర్బో, కోటక్ మహీంద్రా బ్యాంక్, హిందూస్థాన్ యూనీ లివర్ (హెచ్‌యూఎల్), ఐటీసీ నష్టాలతో ముగిస్తే, భారతీ ఎయిర్‌టెల్ మాత్రమే లాభ పడింది. గత ఐదు రోజుల్లో బీఎస్ఈ సెన్సెక్స్ 2290.21 పాయింట్లు (2.91 శాతం) పతనమైంది. నిఫ్టీ 667.45 పాయింట్లు (2.81 శాతం) నష్టపోయింది. సోమవారం నాటికి దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2463.72 కోట్ల విలువైన వాటాలను ఉపసంహరించారు.

# దేశం-విదేశం | NATIONAL-INTERNATIONAL



# ఫర్నీచర్ మార్కెట్‌లో భారీ అగ్నిప్రమాదం


**మహా:** మహారాష్ట్ర రాజధాని ముంబైలో మంగళవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. నవీ ముంబై శివార్లలోని ఒషివారా ఏరియా లోగల ఫర్నీచర్ మార్కెట్ లో ఒక్కసారిగా అగ్ని కీలలు ఎగిసిపడ్డాయి. చూస్తుండగానే 10 ఫర్నీచర్ దుకాణాలకు మంటలు విస్తరించాయి. ఆ దుకాణాల్లోని ఫర్నీచర్ పూర్తిగా అగ్ని ఆహుతైంది. ఇంతలో స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. ఏకంగా 20 ఫైరింజన్‌ల సాయంతో మంటలను ఆర్పేశారు. మరిన్ని దుకాణాలకు మంటలు అంటుకోకుండా అడ్డుకున్నారు. నవీ ముంబైలోని స్వామి వివేకానంద మార్గ్‌లో ఈ ప్రమాదం జరిగింది. అయితే ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని పోలీసులు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉందని చెప్పారు. ఆస్తి నష్టం మాత్రం భారీగా జరిగిందన్నారు.

# జేఈఈ మెయిన్ ఫలితాలు విడుదల..

## వెబ్‌సైట్‌లో స్కోర్ కార్డ్స్




**మహా:** జేఈఈ మెయిన్స్ 2025 సెషన్1 ఫలితాలు విడుదలయ్యాయి. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఫలితాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఫలితాలను చెక్ చేసుకుని స్కోర్ కార్డులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఎన్టీఏ తెలిపింది. దేశవ్యాప్తంగా వివిధ ఐఐటీలు, ఎన్ఐటీలలో ప్రవేశాల కోసం ఏన్టీఏ జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్ పరీక్షలను నిర్వహిస్తుంటుంది. ఇందులో జేఈఈ మెయిన్స్ రెండు సెషన్లలో ఉంటుంది. ఈ రెండింటిలో ఒక్క సెషన్‌లో అర్హత సాధించినా అభ్యర్థులు అడ్వాన్స్ రాసేందుకు అవకాశం కల్పిస్తారు. జేఈఈ మెయిన్స్ సెషన్ 1 పరీక్ష ప్రశ్నపత్రాల్లో వచ్చిన 12 ప్రశ్నలను తొలగించినట్టు ఎన్టీఏ ప్రకటించింది. అభ్యర్థులకు ఆ 12 ప్రశ్నలకు పూర్తి మార్కులు వేసినట్లు తెలిపింది. జేఈఈ మెయిన్స్ 2025 సెషన్ 1 పరీక్షలు గత జనవరిలో ముగిశాయి. రెండో సెషన్ పరీక్షలు ఏప్రిల్‌లో జరగనున్నాయి. ప్రస్తుతం సెషన్ 2 కోసం దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది. జేఈఈ మెయిన్స్‌లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు మే నెలలో జరిగే జేఈఈ అడ్వాన్స్ పరీక్ష రాసేందుకు అర్హులవుతారు. జేఈఈ మెయిన్స్ రెండు సెషన్ల నుంచి మొత్తం 2.5 లక్షల మందిని అడ్వాన్స్ పరీక్షకు ఎంపిక చేస్తారు. జేఈఈ మెయిన్స్ సెషన్ 1 ఫలితాలు jeemain.nta.nic.in. వెబ్‌సైట్‌లో కాస్సేపట్లో అందుబాటులో ఉన్నాయి. వెబ్‌సైట్‌లోకి వెళ్లి వ్యూ స్కోర్ కార్డ్ లేదా వ్యూ జేఈఈ మెయిన్ 2025 రిజల్ట్స్ బటన్‌పై క్లిక్ చేయాలి. ఆ తరువాత మీ అప్లికేషన్ నెంబర్, పాస్‌వర్డ్ ఎంటర్ చేస్తే ఫలితాలు స్క్రీన్‌పై ప్రత్యక్షమవుతాయి. ఫలితాలను చూసుకుని స్కోర్ కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.



# అమెరికాలో ఆగని విమాన ప్రమాదాలు..

## ఆరిజోనాలో ఢీకొన్న రెండు ప్రైవేట్ జెట్స్

**ఆరిజోనా:** అమెరికాలో మరోసారి విమాన ప్రమాదం చోటుచేసుకున్నది. ఆరిజోనాలో రెండు విమానాలు ఢీకొన్నాయి. ఆరిజోనాలోని స్కాట్‌డేల్ విమానాశ్రయంలో రెండు ప్రైవేటు జెట్ విమానాలు ఢీకొన్నాయి. దీంతో ఒకరు మరణించారు. పలువురు గాయపడినట్లు అధికారులు వెల్లడించారు. సోమవారం మధ్యాహ్నం 2.45 (అమెరికా కాలమానం ప్రకారం) లియర్‌జెట్ 35ఏ విమానం ల్యాండింగ్ అయిన తర్వాత రన్‌వే నుంచి జారి రన్‌వేపై ఉన్న బిజినెస్ జెట్ గల్ఫ్ స్ట్రీమ్ జీ200ను ఢీకొట్టింది. దీంతో విమానాశ్రయంలో రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. సాంకేతిక లోపం కారణంగా ప్రమాదం జరిగిందని ఎయిర్‌పోర్ట్ అధికారులు వెల్లడించారు. గత పదిరోజుల్లో అమెరికాలో ఇది నాలుగో విమాన ప్రమాదం. ఈ నెల 7న అలస్కాలో ఓ విమానం అదృశ్యమైన విషయం తెలిసిందే. బేరింగ్ ఎయిర్ సంస్థకు చెందిన సెస్నా 208 బీ గ్రాండ్ కారవాన్ మోడల్ విమానం గత శుక్రవారం గల్లంతయింది. ప్రమాద సమయంలో విమానంలో 9 మంది ప్రయాణికులు, పైలట్ ఉన్నారు. అంతకుముందు ఓ ఆర్మీ హెలికాప్టర్, పౌరవిమానం వాషింగ్టన్ సమీపంలో ఢీకొన్నాయి. దీంతో 67 మంది మరణించారు. అదేవిధంగా ఫిలడెల్ఫియాలోని షాపింగ్‌మాల్ సమీపంలో ఓ విమానం కుప్పకూలడంతో ఆరుగురు చనిపోయారు.

# మహారాష్ట్రలో 167 గులియన్ బారే సింద్రోమ్ కేసులు.. ఏడు మరణాలు

**మహా:** కరోనా మహమ్మారి ప్రపంచ దేశాల్లో కలకలం సృష్టించినప్పటి నుంచి ఏదైనా కొత్త వైరస్ పేరు వింటేనే జనం గడగడ వణికిపోతున్నారు. ఏ రోగం ఎంత విధ్వంసం చేస్తుందోనని హడలిపోతున్నారు. ఈ క్రమంలోనే ప్రస్తుతం గులియన్ బారే సింద్రోమ్ వ్యాప్తి ఆందోళన కలిగిస్తోంది. మహారాష్ట్రలో ఈ జీబీఎస్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం.. ఇప్పటి వరకూ రాష్ట్ర వ్యాప్తంగా 192 గులియన్ బారే సింద్రోమ్ అనుమానిత కేసులు నమోదు కాగా అందులో 167 కేసులు నిర్ధారణ అయ్యాయి. ఇక ఈ వైరస్ కారణంగా ఏడు మరణాలు కూడా నమోదయ్యాయి. అందులో ఒకరు GBS కారణంగానే మరణించినట్లు నిర్ధరణ అయ్యింది. మిగతా 6 కేసులపై అనుమానాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. కాగా, 167 కేసుల్లో.. పూణే మున్సిపల్ కార్పొరేషన్ (PMC) పరిధిలో 39, ఇతర గ్రామాల నుంచి 91, పింప్రి చించ్వాడ్ మున్సిపల్ కార్పొరేషన్ (PCMC) నుంచి 29, పూణే రూరల్ ఏరియాలో 25,



ఇతర జిల్లాల నుంచి 8 కేసులు రికార్డయ్యాయి. ప్రస్తుతం 48 మంది రోగులు ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో చికిత్స పొందుతున్నారు. అందులో 21 మంది వెంటిలేటర్లపై ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇక చికిత్స అనంతరం సుమారు 91 మంది బాధితులు ఆసుపత్రుల నుంచి డిశ్చార్జ్ అయినట్లు వెల్లడించారు. కేసులు పెరుగుతున్న నేపథ్యంలో మహారాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు ప్రభావిత ప్రాంతాల్లో నిఘాను పెంచి నివారణ చర్యలను వేగవంతం చేసింది. వ్యాధి వ్యాప్తి నేపథ్యంలో పూణె మున్సిపల్ కార్పొరేషన్.. పూణే నగరంలోని సింహగడ్ రోడ్డులోని నాందేడ్ గ్రామం, ధయారి, పరిసర ప్రాంతాల్లో 30 ప్రైవేట్ నీటి సరఫరా ప్లాంట్లను సీజ్ చేసింది. ప్రజలు పలు జాగ్రత్తలు పాటించాలని సూచించింది.

**లక్షణాలు ఎలా ఉంటాయి..?**

జీబీఎస్ బారినపడిన వ్యక్తిలో సొంత రోగనిరోధక వ్యవస్థ దాడి చేయడంవల్ల నాడీ వ్యవస్థ క్రమంగా నిర్వీర్యం చేస్తుంది. ముందుగా పాదాల నుంచి మొదలై పైవరకు ఈ సింద్రోమ్ పాకుతుంది. దాంతో కాళ్లు మొదలు ఒంట్లోని ఒక్కో భాగం కదలికలేకుండా పోతుంది. కండరాలు బలహీనమవుతాయి. దాంతో భరించలేని నొప్పి కలుగుతుంది. విపరీతమైన నిస్సత్తువ ఏర్పడుతుంది. ఈ సింద్రోమ్ పెద్దవాళ్లలో, ముఖ్యంగా మగవాళ్లలో ఎక్కువగా సంక్రమిస్తుంది. అయితే, అత్యంత అరుదుగానైనా అన్ని వయసుల వారికి ఈ సింద్రోమ్ ముప్పు పొంచి ఉంటుంది. జీబీఎస్ తాలూకూ అత్యంత ప్రధాన లక్షణం విపరీతమైన నీరసమని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూరోలాజికల్ డిజార్డర్స్ అండ్ స్ట్రోక్స్ వెల్లడించింది. తొలి దశలో మెట్లెక్కుతుంటేనో, నడుస్తుంటేనో కూడా విపరీతమైన నీరసం రావడాన్ని దీని తొలి లక్షణంగా భావించవచ్చు. తర్వాతి దశలో శ్వాసప్రక్రియను నియంత్రించే కండరాలు బాగా బలహీనపడతాయి. ఎంతలా అంటే మెషిన్ సాయంతో ఊపిరి తీసుకోవాల్సిన పరిస్థితి కూడా వస్తుంది. ఈ లక్షణాలు తలెత్తిన రెండే రెండు వారాల్లో సమస్య బాగా ముదిరి రోగిని కదల్లేని స్థితికి చేరుస్తుంది. నరాలు బాగా దెబ్బ తింటాయి కాబట్టి నరాల వ్యవస్థ నుంచి మెదడుకు అస్తవ్యస్త సంకేతాలు అందుతుంటాయి. దాంతో చర్మంలోపల పురుగులు పాకుతున్నట్టు చెప్పలేని బాధ కలుగుతుంది. దవడలు నొప్పిగా మారుతాయి. మాట్లాడటం, నమలడం, మింగడం ఇబ్బందిగా ఉంటుంది. హృదయ స్పందనలో, రక్తపోటులో తేడాలు వస్తాయి. జీర్ణశక్తి మందగిస్తుంది.

## జీబీఎస్ అంటే ఏమిటి..?


జీబీఎస్ అంటే గులియన్ బారే సింద్రోమ్. ఈ గులియన్ బారే సింద్రోమ్ అనేది ఒక రకమైన ఆటో ఇమ్యూన్ (ఒక వ్యక్తిలోని రోగనిరోధక వ్యవస్థ తనలోని ఆరోగ్య కణాలనే శత్రువులుగా భావించి దాడి చేయడం) సింద్రోమ్. ఈ సింద్రోమ్ బారినపడిన వ్యక్తిలో ఉన్న రోగనిరోధక వ్యవస్థ అతని నాడీ వ్యవస్థపైనే దాడి చేస్తుంది. అందుకే దీన్ని ఆటో ఇమ్యూన్ సింద్రోమ్ అని అంటారు. ఈ సింద్రోమ్‌వల్ల బాధితుడిలోని నరాలు, కండరాలు బలహీనంగా మారుతాయి. వివిధ రకాల వైరల్, బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్‌లు సోకిన వారు.. అలాంటి సమయంలో ఈ గులియన్ బారే సింద్రోమ్ బారిన పడే ప్రమాదం కూడా ఉంది.



## ఆహా ఓటీటీలో శివన్న బ్లాక్ బస్టర్ మూవీ..

### తెలుగులో స్ట్రీమింగ్.. ఎప్పటినుంచంటే?

కన్నడ సూపర్ స్టార్ శివరాజ్ కుమార్ గురించి తెలుగు ఆడియెన్స్ కు ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. ప్రస్తుతం గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా నటిస్తోన్నఆర్ సీ 16(వర్కింగ్ టైటిల్ ) సినిమాలో శివన్న కూడా ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు. జాన్వీ కపూర్ ఈ మూవీలో హీరోయిన్ గా నటిస్తోంది. కాగా గతేడాది శివన్న నటించిన బ్లాక్ బస్టర్ సినిమా 'భైరతి రణగల్'. నవంబర్ 15న థియేటర్లలో విడుదలైన ఈ సినిమా కన్నడ ఆడియెన్స్ ను బాగా మెప్పించింది. అందుకే రెండు వారాల తర్వాత తెలుగులోనూ (నవంబర్ 30) విడుదలై ఇక్కడ కూడా మంచి వసూళ్లు సాధించింది. ఇందులో శివరాజ్ కుమార్ ఓ పవర్ ఫుల్ లాయర్ గానూ, అదే సమయంలో పేదల పక్షాన పోరాడే నాయకుడిగానూ అద్భుతంగా నటించాడు. థియేటర్లలో కలెక్షన్ల వర్షం కురిపించిన భైరతి రణగల్ ఒరిజినల్ వెర్షన్ ఇప్పటికే ఓటీటీలోకి వచ్చేసింది. 'అమెజాన్ ప్రైమ్ వీడియో' లో కన్నడ భాషలో శివన్న మూవీ ఈ స్ట్రీమింగ్ అవుతోంది. అయితే భైరతి రణగల్ తెలుగు వెర్షన్ ఇప్పుడు ఓటీటీలోకి రానుంది. ప్రముఖ తెలుగు ఓటీటీ ప్లాట్ ఫామ్ ఆహాలో ఫిబ్రవరి 13 నుంచి శివన్న సినిమా తెలుగు వెర్షన్ అందుబాబులోకి రానుంది. ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా అధికారికంగా ప్రకటించింది ఆహా. నర్తన్ తెరకెక్కించిన 'భైరతి రణగల్' సినిమాలో శివరాజ్ కుమార్ సరసన సప్త సాగరాలు దాటి ఫేమ్ రుక్మిణి వసంత్ హీరోయిన్ గా నటించింది. 'గీతా పిక్చర్స్' బ్యానర్ పై శివన్న భార్య గీతా శివరాజ్‌కుమార్ ఈ సినిమాను నిర్మించారు. రాహుల్ బోస్, అవినాశ్, దేవ రాజ్, ఛాయా సింగ్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. కేజీఎఫ్, సలార్ ఫేమ్ రవి బ్రసూర్ సంగీతం అందించారు. మరి థియేటర్లలో ఈ యాక్షన్ థ్రిల్లర్ ను మిస్ అయ్యారా? అయితే ఎంచెక్కా ఓటీటీలో చూసి ఎంజాయ్ చేయండి.



## కాజల్‌కు తప్పని కష్టాలు

### ముద్దుగుమ్మ కెరీర్ పై సీనియర్స్ దెబ్బ

కాజల్ అగర్వాల్‌పై కష్టాలన్నీ కలిసి ఒకేసారి అటాక్ చేస్తున్నాయి. ఎప్పుడూ బిజీగా ఉన్నట్లే కనిపిస్తుంది కానీ చేతిలో ఒక్క సినిమా కూడా ఉండదు. కమిటైన సినిమాల్లోంచి కూడా ఈమెను తప్పి స్తున్నారు. రిలీజైన సినిమాల్లో కాజల్ కనిపించట్లేదు. గత మూడేళ్లుగా ఇదే సిచ్యువేషన్‌లో ఉన్నారు ఈ సీనియర్ బ్యూటీ. ఆచార్య నుంచే కాజల్ బ్యాడ్‌లక్ మొదలైంది. అందులో కథకు కాజల్ క్యారెక్టర్ అక్కర్లేదని.. షూటింగ్ చేసాక తప్పించారు కొరటాల శివ. ఆ తర్వాత నాగార్జున ఘోస్ట్ సినిమాలోనూ హీరోయి న్‌గా తీసుకుని.. తర్వాత తప్పించారు. ఇక భగవంత్ కేసరిలో ఉన్నా.. కాజల్ పాత్రకు పెద్దగా వెయిటేజ్ ఉండదు. అంతా బాలయ్య, శ్రీలీలే చూసుకున్నారు. ఇండియన్ 2తో అయినా జాతకం మారుతుందేమో అనుకుంటే.. అందులో అసలు కాజల్ కనిపించనే లేదు. పార్ట్ 3లోకి పార్సల్ చేసారు శంకర్. కానీ పార్ట్ 2 ఫలితం చూసాక ఇండియన్ 3 వచ్చేది అనుమానమే. దాంతో అక్కడ కూడా కాజల్‌కు కష్టాలు తప్పలేదు. ప్రస్తుతం కన్నప్పలో పార్వతిగా నటిస్తున్నారు కాజల్. మొత్తంగా సీనియర్ హీరోలంతా కలిసి కాజల్‌కు షాకిచ్చారు.

## ఎక్కడికీ వెళ్లకూడదు...

### డార్లింగ్‌కి కెప్టెన్ కండీషన్

నా థాట్ వేరు... నా సినిమా వేరూ అంటూ చాలా స్పెషల్‌గా రూట్ మ్యాప్ వేసుకుంటున్నారు కెప్టెన్ సందీప్ రెడ్డి వంగా. ఎవరెన్ని అన్నా.. ఏం అన్నా.. తాను నమ్మిన విషయాన్ని పక్కాగా అమలు చేసుకుంటున్నారు. ఆ కాన్ఫిడెన్స్ తోనే ప్రభాస్‌కి కూడా కండిషన్స్ అప్లై అంటున్నారట సందీప్. రీసెంట్‌గా కల్కి సక్సెస్ చూసిన ప్రభాస్‌కి ఇప్పుడు సెట్స్ మీద రెండు సినిమాలున్నాయి. వాటిలో ఒకటి రాజా సాబ్. రెండు ఫౌజీ. రాజా సాబ్ ఈ ఏడాది రిలీజ్ అయినా, ఫౌజీని నెక్స్ట్ ఇయర్‌కి షిఫ్ట్ చేసే అవకాశాలున్నాయి. అంతలో సలార్ సినిమా ముందుకొస్తే? సలార్ ముందుకొచ్చినా, కల్కి సీక్వెల్ ముందుకొచ్చినా... స్పిరిట్ వెనక్కి వెళ్లే ప్రమాదం గట్టిగా కనిపిస్తోంది. దానికి రీజన్ కూడా సందీప్ రెడ్డి వంగా. నా సినిమా చేస్తున్నప్పుడు మరే సినిమాలో నటించకూడదు, నా మూవీ లుక్ బయటకు లీక్ కావడానికి వీల్లేదు. అందుకే మిగిలిన సినిమాలన్నిటినీ కంప్లీట్ చేశాకే, నా సినిమాకు రండి అని స్ట్రాంగ్ గానే చెప్పేస్తున్నారట. సో, ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రభాస్.. సందీప్ సినిమా షూటింగ్‌కి వెళ్తే రాజా సాబ్, ఫౌజీ ప్రమోషన్లకు హాజరు కావడం కుదరదు. అలాగని రాకుండా ఉంటారా? లేకుంటే గెటప్‌ని ఏదో రకంగా మేనేజ్ చేస్తారా? అసలు స్పిరిట్‌ని ఎప్పుడు స్టార్ట్ చేయాలనుకుంటు న్నారు? ఇప్పుడు రెబల్ సైన్యం ఆన్సర్ ప్లీజ్ అని అడుగుతున్న ప్రశ్నలివి.



# క్రీడా వార్తలు SPORTS NEWS

## ప్రపంచ ఛాంపియన్ గుకేశ్‌కు షాక్..

### క్వార్టర్స్‌లోనే ఔట్.. చెన్నై కుర్రాడికి ఏమైంది?

జర్మనీలోని వీసెన్ హౌస్ లో జరుగుతున్న ఫ్రీస్టైల్ చెస్ గ్రాండ్ స్లామ్ టూర్ తొలి ఈవెంట్లో ప్రపంచ ఛాంపియన్ దొమ్మరాజు గుకేశ్ కు షాక్. ఈ చెన్నై ఆటగాడు క్వార్టర్స్ లో ఓడిపోయాడు. ఈ టోర్నీలో ఒక్క విక్టరీ లేకుండానే నిష్క్రమించాడు. గతేడాది చివర్లో చెస్ వరల్డ్ ఛాంపియన్ గా నిలిచి చరిత్ర నమోదు చేసిన గుకేశ్ నుంచి ఇలాంటి ప్రదర్శన ఊహించనిదే.

**18 ఎత్తుల్లోనే**


క్వార్టర్స్ లో ప్రపంచ రెండో ర్యాంకర్ ఫాబియానో కరువానాతో తొలి గేమ్ లో ఓడిపోయిన గుకేశ్ కు రెండో రౌండ్లో డూ ఆర్ డై పరిస్థితి తలెత్తింది. రేసులో నిలవాలంటే కచ్చితంగా విక్టరీ సాధించాల్సి వచ్చింది. కానీ కరువానా దూకుడు ముందు గుకేశ్ తేలిపోయాడు. కేవలం 18 ఎత్తుల్లోనే ఓటమి అంగీకరించాడు. బ్లాక్ పీస్ లతో ఆడిన గుకేశ్ ఏమంత ఎఫెక్టివ్ గా కనిపించలేదు.

**విక్టరీ లేకుండానే**

ఈ టోర్నీలో ఒక్క విక్టరీ లేకుండానే గుకేశ్ నిష్క్రమించాడు. అంతకుముందు ప్రపంచ నంబర్ వన్ మాగ్నస్ కార్ల్ సన్, అలీరెజా ఫిరోజా చేతిలో ఓటమి పాలయ్యాడు. 8వ స్థానంతో లాస్ట్ లో నిలిచి క్వార్టర్స్ కు అర్హత సాధించాడు. కానీ క్వార్టర్స్ లో వరుసగా రెండు రౌండ్లలోనూ ఓడాడు. అంతకుముందు ర్యాపిడ్ సెక్షన్ లో టాప్ లో నిలిచిన కరువానా కు ఆపోనెంట్ ను ఎంచుకునే ఛాన్స్ వచ్చింది. అతను గుకేశ్ ను ఎంచుకున్నాడు. చివరకు విజయం సాధించాడు.

**ఆ వివాదం**

మరోవైపు ఫిడే, ఫ్రీస్టైల్ చెస్ టూర్ మధ్య వివాదం కొనసాగుతూనే ఉంది. ప్రపంచ ఛాంపియన్ షిప్ అనే పదాన్ని ఫ్రీస్టైల్ చెస్ టూర్ వాడొద్దని ఫిడే సూచించింది. దీనికి ఫ్రీస్టైల్ చెస్ టూర్ అంగీకరించింది. కానీ ఆ తర్వాత దీని నుంచి మధ్యలో ఫిడే తప్పుకొంది. ఈ నిర్ణయంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ఫ్రీస్టైల్ చెస్ టూర్ కో ఫౌండర్, టాప్ ప్లేయర్ కార్ల్ సన్.. ఫిడే టోర్నీలో ఆడబోనని అనౌన్స్ కూడా చేశాడు.



## గోల్డ్ పై గురి.. సింధు లేకున్నా భారత్ పసిడి కొట్టేనా?



ఆసియా మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ టోర్నీకి మంగళవారం (ఫిబ్రవరి 11) తెరలేచింది. చైనా లోని కింగ్ దావోలో ఈ టోర్నీ ఆరంభమైంది. 12 దేశాలు పోటీపడుతున్న ఈ టోర్నీలో గోల్డ్ కొట్టడమే లక్ష్యంగా భారత్ రేసులోకి దిగుతోంది. కానీ స్టార్ షట్లర్ పీవీ సింధు గాయంతో దూరమవడం టోర్నీలో భారత అవకాశాలపై ప్రభావం చూపే అవకాశముంది. పురుషుల జట్టు బలంగానే కనిపిస్తున్నా.. మహిళల జట్టు మాత్రం వీక్ గా ఉంది.

**12 జట్లు.. 4 గ్రూప్ లు**

ఆసియా మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ టోర్నీలో పోటీపడుతున్న 12 దేశాలను 4 గ్రూప్ లుగా విభజించారు. గ్రూప్ ఎలో చైనా, చైనీస్ తైపీ, సింగపూర్.. గ్రూప్‌బిలో ఇండోనేసియా, మలేసియా, హాంకాంగ్.. గ్రూప్‌సిలో జపాన్, కజకిస్థాన్, థాయ్ లాండ్.. గ్రూప్‌డిలో దక్షిణ కొరియా, భారత్, మకావు ఉన్నాయి. గ్రూప్ దశలో ఒక్కో జట్టు మిగతా రెండు జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడుతుంది. గ్రూప్ లొ టాప్2 టీమ్స్ క్వార్టర్స్ చేరతాయి.

**మకావుతో భారత్ ఢీ**

భారత్ తన తొలి మ్యాచ్ లో బుధవారం (ఫిబ్రవరి 12) మకావుతో తలపడుతుంది. గురువారం (ఫిబ్రవరి 13) కొరియాను ఢీ కొడుతుంది. హెచ్ఎస్ ప్రణయ్, లక్ష్యసేన్, సాత్విక్ సాయిరాజ్ చిరాగ్ శెట్టి లాంటి షట్లర్లు భారత పురుషుల జట్టులో ఉన్నారు. మహిళల జట్టులో మాళవిక బన్సోద్, తనీషా, ట్రీసా, అశ్విని పొన్నప్ప, గాయత్రీ గోపిచంద్ తదితరులున్నారు. ఒక్కో మ్యాచ్ లో పురుషుల సింగిల్స్, డబుల్స్, మహిళల సింగిల్స్, డబుల్స్, మిక్స్ డ్ డబుల్స్ గేమ్స్ జరుగుతాయి.

**అప్పుడు కాంస్యం**

2017లో ప్రారంభమైన ఈ ఛాంపియన్ షిప్ లో భారత్ ఇప్పటివరకూ ఒక్క పతకమే గెలిచింది. రెండేళ్లకోసారి జరిగే ఈ టోర్నీలో భారత్ 2023లో కాంస్యం గెలిచింది. ఈ టోర్నీలో బలమైన జట్టు చైనా గత రెండు సార్లు పసిడి పతకాలు సాధించింది. ఈ సారి భారత్ గోల్డ్ కొట్టాలంటే చైనా సవాలును దాటాల్సి ఉంటుంది. కానీ ప్రస్తుత ఫామ్ ప్రకారం భారత్ కు అది చాలా టఫ్ టెస్ట్ అని చెప్పొచ్చు.

## ట్రెండ్ అవుతున్న నయా టెన్నిస్ స్టార్..

### నాదల్ అకాడమీలో ట్రెయినింగ్..

### ఎవరీ 15 ఏళ్ల మాయా రాజేశ్వరన్

టెన్నిస్ లో సెన్సేషనల్ ప్రదర్శనతో మాయా రాజేశ్వరన్ దూసుకెళ్తోంది. సింగిల్స్ లో సూపర్ ఫామ్ తో భారత టాప్ సింగిల్స్ ప్లేయర్ గా ఎదిగేలా కనిపిస్తోంది. 15 ఏళ్లకే వయసుకు మించిన ఆటతీరుతో అదరగొడుతోంది. నిలకడగా రాణిస్తోంది. డబ్ల్యూటీఏ పాయింట్ ఖాతాలో వేసుకుంది.

**డబ్ల్యూటీఏ పాయింట్**

ఎల్ అండ్ టీ ముంబై ఓపెన్ డబ్ల్యూటీఏ 125 సిరీస్‌లో యువ టెన్నిస్ ప్లేయర్ మాయా అసాధారణ ప్రదర్శనతో సెమీస్ లో చోటు దక్కించుకుంది. ఈ క్రమంలో ఇటలీకి చెందిన 264వ ప్రపంచ ర్యాంకర్ నికోల్ ఫోస్సా హ్యూర్గోపై 6-3, 3-6, 6-0తో గెలిచింది. ఆ తర్వాత ప్రపంచ 434వ ర్యాంకర్ జెస్సికా ఫైలా (అమెరికా)ను 7-6(9), 1-6, 6-4 తో చిత్తుచేసింది. ఈ అద్భుత విజయాలతో డబ్ల్యూటీఏ పాయింట్ సాధించిన యంగెస్ట్ ఇండియన్ ప్లేయర్ గా నిలిచింది.

**వైల్డ్ కార్డుతో ఎంట్రీ**

ఈ డబ్ల్యూటీఏ 125 ఈవెంట్‌లో వైల్డ్ కార్డుతో ఎంట్రీ అయిన మాయా సూపర్ పర్ ఫార్మెన్స్ తో సత్తాచాటుతోంది. ఆమె ప్లేయింగ్ స్టైల్ దిగ్గజం సెరెనా విలియమ్స్, సబలెంకా ను పోలి ఉంది. తమిళనాడులోని కోయంబత్తూరులో జన్మించిన మాయా చిన్నతనంలో ఆఫ్టర్ స్కూల్ ప్రోగ్రామ్ లో భాగంగా టెన్నిస్ ఎంచుకుంది. ఆ తర్వాత అదే ఆమెకు ప్రాణంగా మారింది.

**నాదల్ అకాడమీలో**

మొదట భారత మాజీ నంబర్ వన్ కె.జి.రమేష్ దగ్గర శిక్షణ పొందిన మాయా.. ఆ తర్వాత ఐదు సంవత్సరాలు కోచ్ మనోజ్ కుమార్ ట్రెయినింగ్ లో మెరుగైంది. మెల్లార్కాలోని రాఫెల్ నాదల్ అకాడమీలో ఒక వారం శిక్షణ ఇప్పటి వరకూ ఆమె కెరీర్ లో కీలక మలుపు. తన నైపుణ్యాల కారణంగా ఈ అకాడమీలో ఒక ఏడాది పాటు శిక్షణ పొందే అవకాశం ఆమెకు దక్కింది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com